# మనసులో మాట

KANCHARLA | నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. | సంచలన తెలుగు దిన పత్రిక

## కోస్తాంధ్ర

రాజమహేంద్రవరం | కాకినాడ | కోనసీమ

శనివారం 17 అక్టోబర్ 2026 పేజీ 16




# ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావివ్వొద్దు

- నిష్పాక్షిక ఎన్నికలే లక్ష్యం.. అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం
- ఎన్నికల విధివిధానాల పై పూర్తి అవగాహనతో విధులు నిర్వహించాలి
- ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పాక్షికతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
- జిల్లా కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్

**కాకినాడ (మనసులో మాట) అక్టోబరు 16 :**

ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలను పారదర్శకం గా, నిష్పాక్షికంగా, ప్రశాం త వాతావరణంలో నిర్వహించేందుకు సంబంధిత అధికారులు ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమ నిబం ధనలను పూర్తి స్థాయిలో అవగాహన చేసుకుని బాధ్యతా యుతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల నిర్వహణ సంబంధించి రిటర్నింగ్ అధికారులు సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు 2026 నిర్వ హణకు సంబంధించి జిల్లాలో నియమితులైన రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల విధులు, బాధ్యతలు, ఎన్నికల నియమావళి, సంబంధిత రికార్డుల నిర్వహణ, ఎన్నికల సామగ్రి స్వీకరణ, భద్రపరచడం పంపిణీ వంటి ..మిగతా 2లో



## టిడిపి పార్టీలోకి చేరికలు

4

# ఎన్నికల ప్రచార ప్రింటింగ్‌పై కలెక్టర్ హెచ్చరిక



- ప్రచార పోస్టర్లు, కరపత్రాల ముద్రణకు నియమాలు పాటించాలి
- ఎన్నికల ప్రచార సామగ్రి ముద్రణ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
- ప్రింటింగ్ ప్రెస్ యజమానులు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు
- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కీర్తి చేకూరి సూచన

**రాజమహేంద్రవరం (మనసులో మాట) అక్టోబర్ 16 :**

తూర్పుగోదావరి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రచార సామగ్రి ముద్రణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, ప్రింటింగ్ ప్రెస్ యజమానులు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ..మిగతా 2లో



## ఖరీఫ్ 202627 ధాన్యం సేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి పారదర్శకతతో నిర్వహించాలి

- జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్

**కాకినాడ (మనసులో మాట) అక్టోబరు 16**

జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియను రైస్ మిల్లర్లు అత్యంత వేగవంతంగా, పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అన్నారు.శుక్రవారం కాకినాడ కలెక్టరేట్ లోని విధాన గౌతమి సమావేశ మందిరం లో పౌరసరఫరాల సంస్థ ..మిగతా 2లో

## కోరింగా కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో... సాంప్రదాయబద్ధంగా దసరా సంబరాలు

7



## సరస్వతీ దేవి అలంకరణలో కనకదుర్గమ్మ



10

మనసులోమాట
KANCHARLA నిజమే మా ఋజం.. అదే మా ఐక్యం.. సంచలన తెలుగు దిన పత్రిక

# అపోలో హాస్పిటల్ విస్తరణ

- కాకినాడలో నూతన బ్లాక్ నిర్మాణానికి శ్రీకారం
- అందుబాటులోకి మరిన్ని అధునాతన వైద్య సేవలు
- శంకుస్థాపన చేసిన యాజమాన్య ప్రతినిధులు





**కాకినాడ (మనసులో మాట) అక్టోబర్ 16**

వైద్యరంగంలో విశిష్ట సేవలంది స్తూ రోగుల విశ్వాసాన్ని చురగొన్న అపోలో హాస్పిటల్ తన సేవలను విస్తరించాలని నిర్ణయించింది. కాకినాడ మెయిన్ రోడ్ లోని అపోలో హాస్పిటల్ ప్రాంగణం లో రెండవ నూతన బ్లాక్ నిర్మాణానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. కాకినాడ అపోలో హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ డాక్టర్ ఏ. గణేష్ పర్య వేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. అపోలో హాస్పిటల్స్ వైస్ ప్రెసిడెంట్ (ఫైనాన్స్) రామ్ శేఖర్ రెడ్డి, మరో వైస్ ప్రెసిడెంట్ (ప్రాజెక్ట్స్) శ్రీని వాసరెడ్డి సమక్షంలో శుక్రవారం ఉదయం 7:50 నిమిషాలకు నూతన బ్లాక్ నిర్మాణ పనులను ప్రారంభించారు. యూరాలజిస్ట్ డాక్టర్ కరుణాక ర్ రెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్ హెడ్) జి.వి.ఆర్ మూర్తి, సీనియర్ ఉద్యోగి శ్రీనివాస్ శంకు స్థాపన సందర్భం గా జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అపోలో హాస్పిటల్స్ వైస్ ప్రెసిడెంట్ (ఫైనాన్స్) రామశేఖర్ రెడ్డి మా ట్లాడుతూ ప్రస్తుతం కాకినాడలో ఉన్న వంద పడకల అపోలో హా స్పిటల్ ను మరో వంద పడకలతో అత్యాధునిక సౌకర్యాలతో విస్తరి స్తున్నామని చెప్పారు. ఆపరేషన్ థియేటర్లు, క్రిటికల్ కేర్, ఎమర్జెన్సీ విభాగం, సూట్ రూమ్స్ ఇతర సదుపాయాలను ఇక్కడ కల్పిస్తు న్నామని చెప్పారు. రానున్న 15 నెలల్లో నిర్మాణ ప్రక్రియ పూర్తి చేసి అపోలో హాస్పిటల్ నూతన బ్లాక్ ను అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. అలాగే త్వరలోనే క్యాన్సర్ విభాగాన్ని కూడా ప్రారంభిస్తామని చెప్పారు.



అపోలో హాస్పిటల్స్ కాకినాడ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ ఏ. గణేష్ మాట్లాడుతూ 2004 నుంచి దాదాపు 22 ఏళ్లుగా ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో లక్ష మందికి పైగా రోగులకు అపోలో హాస్పిటల్ మెరుగైన వైద్య సేవలు అందించి ఎన్నో ప్రాణాలు కాపా డిందన్నారు. ప్రస్తుతం ఉన్న 20 వి భాగాలకు అదనంగా నూతన బ్లాక్ లో అధునాతన సౌకర్యాలతో కొత్త విభాగాలను కూడా అందుబాటు లోకి తీసుకొస్తున్నా మని ఆయన చెప్పారు. రానున్న రోజుల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కు చెందిన ప్రజలకు చేరువగా మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే అపోలో హాస్పిటల్స్ అభిమతమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అపోలో హాస్పిటల్స్ విశాఖ సి ఓ ఓ డాక్టర్ కృష్ణ ప్రసాద్, మెడికల్ సూపరిం టెండెంట్ డాక్టర్ చటర్జీ, వివిధ వి భాగాధిపతులు, వైద్య నిపుణులు,, కన్సల్టెంట్లు,అపోలో హాస్పిటల్ కు చెందిన వివిధ విభాగాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సరస్వతీ దేవి అలంక-రణలో కనకదుర్గమ్మ

- ఆరవ రోజు అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- కోలంక దుర్గమ్మ ఆలయంలో లక్ష కుంకుమార్చన.. విద్యార్థినీ విద్యార్థుల ప్రత్యేక పూజలు

**కాజులూరు, (మనసులో మాట) అక్టోబర్ 16**



దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు కనకదుర్గమ్మ అమ్మవారు సర స్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమి చ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తర లివచ్చారు. ముఖ్యంగా విద్యకు అధిదేవత అయిన సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారిని దర్శించుకునేందు కు విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. విద్యాభివృద్ధి, జ్ఞానప్రాప్తి, పరీక్షల్లో విజయాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు.

కాజులూరు మండలం కోలంక గ్రామంలోని దుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ఆరవ రోజు ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. భక్తులు కుంకుమార్చనలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించడంతో ఆలయ పరిసరాలు ఆధ్యా త్మిక శోభను సంతరించుకున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న అమ్మవారి ఆలయాల్లోనూ శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయాలను విద్యుత్తు దీపాలతో అలంకరించ గా, ప్రత్యేక పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు.

# ఎన్నికల ఏర్పాట్లు, భద్రతా చర్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలిలన





**సబ్ కలెక్టర్ శుభం నోఖ్వాల్**

**రాజమహేంద్రవరం (మనసులో మాట) అక్టోబర్ 16**

రాజమహేంద్రవరం గ్రామీణ పరిధిలోని బొమ్మూరు పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల గోడౌన్, రిసెప్షన్ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రాలను సబ్ కలెక్టర్ శుభం నోఖ్వాల్ శుక్రవారం సంబంధిత అధికా రులతో కలిసి పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లు, ఎన్నికల సామగ్రి భద్రపరిచే విధానం, ఎన్నికల అనంతరం పోలింగ్ సిబ్బంది నుంచి సామగ్రి స్వీకరణ, ఓట్ల లెక్కింపు ప్రక్రి యకు అవసరమైన సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లపై



అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శుభం నోఖ్వాల్ మాట్లాడుతూ, ఎన్నికల సామగ్రి భద్రపరిచే ప్రాంతంలో తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, రిసెప్షన్ కేంద్రంలో పోలింగ్ సిబ్బందికి అవ సరమైన సదుపాయాలు కల్పించాలని, ఓట్ల లెక్కింపు కేంద్రంలో విధుల నిర్వహణకు అనువైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ అధికారుల కు సూచించారు.

ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని, భద్రతా పరమైన అంశాల్లో అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల సంఘం మార్గ దర్శ కాలు, నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహిం చాలని అధికారులకు సూచించారు. ఎన్నికల నిర్వహ ణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పరిశీలన లో జెడ్పీ కి సి ఈ వో ఎమ్. రాజు, డీఎస్పీ ఏ. శివ ప్రియ డివిజనల్ డెవలప్మెంట్ అధికారి పి. వీణదేవి, తహసీల్దార్ శ్రీనివాస్ , సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ), రాజమహేంద్రవరం గ్రామీణ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) సిహెచ్ సునీల్ ఆర్క్ స్ట్రాంగ్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలు

- స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు ను పరిశీలించిన ఎస్పీ రాహుల్ మీనా

**అమలాపురం (మనసులోమాట ) అక్టోబరు 16:**



మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రామచంద్రపురం మున్సిపాలిటీ పరిధిలో స్టీల్ వెల్ పేట, బ్రాడీపేట వార్డుల లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా శుక్రవారం పరి శీలించారు. అలాగే ఇందిరా గాంధీ మున్సిపల్ హై స్కూల్ వద్ద ఏర్పాటు చేస్తున్న డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం ఏర్పాట్లను అదే విధంగా ముమ్మిడివరం మున్సిపా లిటీ పరిధిలోని మార్కెట్ వీధి ,బల్ల గేట్ సెంటర్ వార్డుల లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎస్పీ పరిశీలించారు. జిఎంసీ బాలయోగి బాలిక పాఠశాల నందు ఏర్పాటు చేస్తున్న డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్, ఎన్ని కల సామగ్రి పంపిణీ కేంద్రం ఏర్పాట్లను జిల్లా ఎస్పీ క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అదేవిధంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలీసు బందోబస్తు, ముందస్తు భద్రతా ప్రణాళికపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు, భౌగోళిక పరిస్థి తులు, రాకపోకల మార్గాలు, రూట్ మ్యాప్లు, స్ట్రాంగ్ రూమ్ల భద్రత తదితర అంశాలను పరిశీలించి,ఎన్ని కల విధుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్ల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, ప్రవేశ, నిష్క్రమణ మార్గాల నిర్వహణ, పోలీసు బం దోబస్తుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల వద్ద నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది సమ న్వయంతో అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛ నీయ ఘటనలు చోటుచేసుకో కుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా రౌడీషీటర్లు(చెడు నడత కలిగిన వ్యక్తులు) గతంలో ఎన్నికల సమయంలో అల్లర్లు లేదా ఇతర సమస్యలకు కారణమైన వ్యక్తులను గుర్తించి బైండోవర్ చర్యలు చేపట్టామన్నారు. గ్రామాల్లో పల్లెనిద్ర, విలేజ్ విజిట్లు, నాకాబందీ, కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహిస్తూ ఎన్ఫోర్స్మెంట్ ను సమర్థవంతంగా నిర్వ హిస్తున్నారు.

## మహిళా ఉత్పత్తులకు ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలి




- **గుడ్ హెల్త్ ఫుడ్ వెబ్‌సైట్ ప్రారంభించిన డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి**

**ఏలూరు, అక్టోబర్ 16(మనసులో మాట)**

మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి సూచించారు. విజయవాడలో నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళాలో ఏలూరు జిల్లాకు చెందిన 10 స్వయం సహాయక సంఘాల మహిళలు ఏర్పాటు చేసిన ఉత్పత్తుల ప్రదర్శనను ఆమె శుక్రవారం పరిశీలించారు. మహిళలతో మాట్లాడి ఉత్పత్తుల విక్రయాలు, కల్పిస్తున్న వసతుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెం మండలానికి చెందిన మదర్ థెరిసా స్వయం సహాయక సంఘం తయారు చేస్తున్న గుడ్ హెల్త్ మిల్లెట్స్ ఫుడ్ ఉత్పత్తుల ఆన్‌లైన్ విక్రయాల కోసం రూపొందించిన www.goodhealthfood.in వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. డ్వాక్రా మహిళల ఉత్పత్తుల విక్రయాలకు ఓఎన్‌డీసీ ఆన్‌లైన్ వేదిక ద్వారా ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వయం ఏపీ బ్రాండ్‌లో భాగంగా, జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో 'స్వయం ఏలూరు కనెక్షన్' పేరుతో ఆన్‌లైన్ విక్రయాల సదుపాయం కల్పించినట్లు వివరించారు.మదర్ థెరిసా సంఘం అధ్యక్షురాలు తోట కృపా స్నేహన్ సొంతంగా గుడ్ హెల్త్ మిల్లెట్స్ ఫుడ్ బ్రాండ్‌తో ఈకామర్స్ వెబ్‌సైట్‌ను రూపొందించడం అభినందనీయమని విజయలక్ష్మి పేర్కొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ

**ముమ్మిడివరం,( మనసులో మాట), అక్టోబర్ 16:**

ముమ్మిడివరం నగర పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై జిల్లా ఎస్పీ రాహుల్ మీనా సమీక్షించారు. శుక్రవారం నగర పంచాయతీ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి, ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులకు సూచించారు. అనంతరం బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ పుల్లారావు, ముమ్మిడివరం సీఐ ఎం. మోహన్ కుమార్, ఎస్సై బి. శివకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కాకినాడ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా 'రాగా దాండియా ఉత్సవ్ 2.0

- **వేగా జ్యువెలర్స్ ఆధ్వర్యంలో అక్టోబర్ 18న నవరాత్రి సంబరాలు**

**కాకినాడ (మనసులో మాట) అక్టోబర్ 16**

దేవీ నవరాత్రుల శుభ సందర్భంగా వీ వైబ్ సంస్థ సహకారంతో ఈ భారీ దాండియా ఈవెంట్ ప్లాన్ చేసినట్లు వేగా జ్యువెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ వనమా శుక్రవారం వెల్లడించారు. కళలు, సంస్కృతి, ఆప్యాయతలకు నిలయమైన పెన్షన్ల పట్నం కాజాల పట్నం మన కాకినాడ నగర కీర్తి కిరీటంలో మరో సరికొత్త వేడుక చేరనుంది. దేవీ శరన్నవరాత్రి పర్వదినాల వేళ, నగర అస్తిత్వాన్ని, కళాత్మక సంప్రదాయాలను మేళవిస్తూ ప్రముఖ లగ్జరీ జ్యువెలరీ సంస్థ వేగా జ్యువెలర్స్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రాగా దాండియా ఉత్సవ్ 2.0' ను నిర్వహించ బోతోంది. అక్టోబర్ 18 వ తేదీ ఆదివారం సాయంత్రం 7 గంటల నుండి నాగమల్లి తోట జంక్షన్ లోని ద్వారంపూడి ఫంక్షన్ హాల్ వేదికగా ఈ కోలాహలం ప్రారంభం కానుంది.

ప్రముఖుల సమక్షంలో ఈ అద్భుత సాంస్కృతిక మహోత్సవానికి కాకినాడ నగర ఎమ్మెల్యే లు అయిన వనమాడి వెంకటేశ్వరరావు, పంతం వెంకటేశ్వరరావు (పంతం నానాజీ) ముఖ్య అతిథులుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను శాస్త్రోక్తంగా ప్రారంభించ నున్నారు. వీరితో పాటు తెలుగు సినీ పరిశ్రమకు చెందిన పలువురు సినీ తారలు,




రాజకీయ ప్రముఖులు కూడా విచ్చేసి నవరాత్రి వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు.

**బిగ్ బాస్ ఉదయ్ మాస్టర్ టీం ప్రత్యేక ప్రదర్శనలు**

సాంప్రదాయ నవరాత్రి నృత్యాలతో పాటు ఆధునిక వినోదాన్ని అందిస్తూ ఈ సాయంత్రాన్ని మరింత రసవత్తరంగా మార్చనున్నారు. బిగ్ బాస్ ఫేమ్ ఉదయ్ మాస్టర్ నేతృత్వం లోని డాన్స్ టీమ్ ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించనుంది. ఇద్దరు ప్రముఖ డీజేల సంగీత హోరు, సంప్రదాయ పంజాబీ ధోల్ వాయిద్యాల లయబద్ధమైన దరువుల మధ్య సాంప్రదాయ దుస్తుల్లో వచ్చే యువతీయువకులు, మహిళలు దాండియా, గర్బా నృత్యాలతో కాకినాడను గుజరాత్ వీధులను తలపించేలా చేయనున్నారు.

**భారతీయ సంస్కృతికి అద్దం పట్టే ఏర్పాట్లు**

వచ్చిన అతిథులకు భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా హారతి, తిలకంతో సాంప్రదాయ స్వాగతం పలుకుతారు. వేడుక ప్రాంగణంలో నోరూరించే ఫుడ్ స్టాల్స్, ప్రత్యేక మాక్‌టైల్ కౌంటర్లు, ఫేస్ పెయింటింగ్, రంగురంగుల గాజుల స్టాల్స్, సాంప్రదాయ పోటీలు ఏర్పాటు చేశారు. జ్ఞాపకాలను పదిలపరుచుకోవడానికి వీలుగా మ్యాగ్నెటిక్ ఫోటో బూత్, సెల్ఫీ పాయింట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

**కాకినాడ ప్రజలకు వేగా జ్యువెలర్స్ ఆహ్వానం**

ఈ సందర్భంగా వేగా జ్యువెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ నవీన్ వనమ మాట్లాడుతూ నవరాత్రి అనేది భక్తి, సంప్రదాయం, అందరూ కలిసి జరుపుకునే ఒక పండుగ. కాకినాడ నగర కుటుంబాలు, యువత దేవీ శరన్నవరాత్రి స్ఫూర్తిని పంచుకుంటూ మధురమైన జ్ఞాపకాలను సొంతం చేసుకునేందుకు ఈ వేదికను సిద్ధం చేశాం అన్నారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుధాకర్ వనమ మాట్లాడుతూ పండుగలు సమాజంలో బంధాలను బలపరుస్తాయి. కాకినాడ లోని మహిళలు, యువతీయువకులు అందరూ ఈ వేడుకలో భాగస్వాములై విజయవంతం చేయాలని కోరుతున్నాం అని పిలుపు నిచ్చారు.

1989 నుండి నమ్మకానికి, నాణ్యతకు మారుపేరుగా నిలిచిన వేగా జ్యువెలర్స్, కాకినాడ నగర సంస్కృతిని గౌరవిస్తూ అందిస్తున్న ఈ 'రాగా దాండియా ఉత్సవ్ 2.0' నగరవాసులకు ఒక మరువలేని అనుభూతిని ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది

## మొదటి రోజు మండపేట మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్స్ శూన్యం :

- **అభ్యర్థులు తేలక మందగించిన స్థానిక నామినేషన్లు .....**

**మండపేట (మనసులో మాట) అక్టోబర్ 16**

స్థానిక సంస్థల ఎన్నికల సమరం మొదలైనప్పటికీ, నామినేషన్లు మొదటి రోజు మాత్రం ఎలాంటి సందడి లేకుండా ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం శుక్రవారం నామినేషన్ ప్రక్రియ అధికారకంగా ప్రారంభమైనప్పటికీ, ఏ ఒక్కరూ నామినేషన్ దాఖలు కాకపోవడం గమనార్హం.

ఎన్నికల అధికారులకు సమర్పించవలసిన అభ్యర్థుల నామినేషన్ దరఖాస్తు కు అవసరమైన డాక్యుమెంట్లు, ప్రభుత్వ పన్నులు బకాయిలు లేకుండానూ ,బ్యాంకు డాక్యుమెంట్లు, ఆస్తిపాస్తులు వివరాలు, కోర్టు కేసుల వివరాలు, నోటరీ తదితర సర్టిఫికెట్స్, డాక్యుమెంట్స్ కోసం అభ్యర్థులు సంబంధిత వివిధ కార్యాలయాలకు పరుగు పెట్టినట్లు తెలియవచ్చింది. ప్రభుత్వ బకాయిలు చెల్లిస్తేనే అభ్యర్థి తన నామినే



షన్ దరఖాస్తు చేయడం వీలు కాదు కాబట్టి ప్రభుత్వ బకాయిలు శుక్రవారం మూకుమ్మడి గా మున్సిపల్ కార్యాలయం కు వెళ్ళి,పెండింగ్ బకాయిలు చెల్లించారు. అలాగే

ముఖ్యంగా ప్రధాన పార్టీ అయిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, కూటమి పార్టీల తరపున చైర్మన్ అభ్యర్థుల పేర్లు ఇంకా ఖరారు కాకపోవడంతో ఆశావాహులు నామినేషన్ వేసేందుకు వెనకడుగు వేశారు. ప్రధాన రాజకీయ పార్టీ నేతల్లో హ్యాపీ బి. ఫార్మ్ ఇవ్వాలి అన్న సయోధ్య కుదరకపోవడంతోను,

మొదటి రోజు కావడంతో ఎవరూ తమ అభ్యర్థిత్వ దరఖాస్తులు దాఖలు చేసేందుకు ఎవరూ కార్యాలయం వెళ్ళలేదు.ఎన్నికల అధికారులు కార్యాలయాల్లో వేచి చూసినప్పటికీ, అభ్యర్థులెవరూ లేకపోవడంతో నామినేషన్ల సందడి కనిపించలేదు. రాబోవు రెండు మూడు రోజుల్లో పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించిన తర్వాతే నామినేషన్ల ప్రక్రియ వేగం పుంజుకునే అవకాశం ఉంది. అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## వైఎస్సార్‌సీపీకి గుడ్‌బై.. టీడీపీలోకి మాజీ సర్పంచ్ మట్ట రాంబాబు

- **ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గుత్తుల సాయి సమక్షంలో పార్టీలో చేరిక**

**ఐ పోలవరం,( మనసులో మాట), అక్టోబర్ 16:**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి మరో రాజకీయ ఎదురుదెబ్బ తగిలింది. ముమ్మిడివరం మాజీ సర్పంచ్ మట్ట రాంబాబు వైఎస్సార్‌సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గుత్తుల సాయి సమక్షంలో ఆయన పసుపు కండువా కప్పుకుని టీడీపీలో చేరికను ప్రకటించారు. మట్ట రాంబాబు 2006 నుంచి 2011 వరకు ముమ్మిడివరం సర్పంచ్‌గా పనిచేశారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన ఆయనకు నియోజకవర్గంలో రాజకీయంగా మంచి పరిచయాలు ఉన్నాయని, స్థానిక ప్రజలతో సత్సంబంధాలు కలిగిన నాయకుడిగా గుర్తింపు ఉందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తుందనే నమ్మకంతోనే టీడీపీలో చేరినట్లు మట్ట రాంబాబు తెలిపారు. ఆయన చేరికతో ముమ్మిడివరం నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని టీడీపీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.



# పురపాలక సంఘ ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్.

**కాకినాడ (మనసులో మాట) అక్టోబరు 16**



కాకినాడ జిల్లాలో పురపాలక సంఘ (మున్సిపల్) ఎన్నికలను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ప్రశాంత వాతావరణం లో నిర్వహించేందుకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లను అత్యంత పటిష్ఠంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

శుక్రవారం ఆయన జిల్లాలోని పిఠాపురం, గొల్లప్రోలు, పెద్దా పురం, సామర్లకోట పురపాలక సంఘాల్లో విస్తృతంగా పర్య టించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ కోసం సిద్ధం చేస్తున్న డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలు స్ట్రాంగ్ రూముల ఏర్పాట్ల పనులను క్షేత్ర స్థాయిలో స్వయంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల సమయంలో ఎన్నికల సామగ్రి పంపిణీ పోలింగ్ పూర్తయిన తర్వాత సామగ్రి స్వీకరణ ఓట్ల లెక్కింపు అలాగే బ్యాలెట్ పెట్టెలు భద్రపరిచే స్ట్రాంగ్ రూముల వద్ద చేపట్టాల్సిన భద్రతా చర్యలపై అధికారులతో సమీక్షించారు.

ప్రతీ కేంద్రం లోనూ విద్యుత్, తాగునీరు సరఫరా మరుగు దొడ్లు, మైక్ సిస్టమ్స్ వంటి ప్రాథమిక మౌలిక సదుపాయాలు పక్కాగా ఉండాలన్నారు.పోలింగ్, కౌంటింగ్ విధులు నిర్వహించే అధి కారులు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యవంతమైన వసతులు కల్పించాలన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద రెండు అంచల భద్రతా వలయాన్ని ఏర్పాటు చేయాలని, సిసిటీవీ కెమెరాల నిరంతర నిఘా ఉండేలా చూడాలని మున్సిపల్ కమిష నర్లకు, రెవెన్యూ, పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు.ఎన్నికల సామగ్రి భద్రతకు అత్యున్నత ప్రాధా న్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.ఎన్నికల విధుల నిర్వ హణలో ఎలాంటి ఆటంకాలు, ఇబ్బం దులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసు కోవాలన్నారు.రెవెన్యూ, మున్సిపల్, పోలీస్, విద్యుత్ తదితర సంబంధిత శాఖల అధికారులు నిరంతరం సమన్వయంతో పని చేయాలన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబం ధనలను ,రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గ దర్శకాలు, కోడ్ నిబంధనలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లను నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలన్నారు.

మొత్తం ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, విశ్వసనీయత కాపాడేలా ప్రతీ ఒక్క అధికారి బాధ్యతా యుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్లు, ఎస్ దివిజ రాజేశ్వరరావు, కె శ్రీకాంత్ రెడ్డి, పోలీసు ఉన్నతా ధికారులు, రెవెన్యూ అధికారులు ఇతర ఎన్నికల విభాగా ధిపతులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు





# కాకినాడలో ఘనంగా ప్రారంభమైన జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు

**కాకినాడ (మనసులో మాట) అక్టోబర్ 16**

నగరంలోని వైఎస్సార్ స్కేటింగ్ రింక్ వేదికగా జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తూర్పుగోదావరి రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ క్రీడా సంబరాన్ని స్కేటింగ్ కోచ్‌లు ఈశ్వర్, చంటికృష్ణ, అసోసియేషన్ ప్రతినిధి అరుణ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

ఈ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని కాకినాడ, రాజమండ్రి, అమలాపురం, రావులపాలెం, తుని తదితర ప్రాంతాల నుంచి 300 మందికి పైగా బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. 6 ఏళ్ల లోపు విభాగం నుంచి 18 ఏళ్ల పైబడిన కేటగిరీల వరకు వయోపరిమితి ఆధారంగా వేర్వేరు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. ఇన్‌లైన్, క్వాడ్ రేసులతో పాటు ఆర్టిస్టిక్, హాకీ, ఫ్రీస్టైల్, డౌన్‌హిల్, ఆల్‌పైన్, స్కేట్‌బోర్డ్, స్కూటర్, రోడ్డు రేసుల్లో స్కేటర్లు అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ అదరగొడుతున్నారు.

ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 76 మంది క్రీడాకారులను రాబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. వచ్చే నెల 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకు కాకినాడ వేదికగానే రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. అనంతరం రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు డిసెంబర్ 5 నుంచి 15 వరకు బెంగళూరులో జరిగే జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పవన్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు

# ఎన్నికల సందడి.. ప్రజా సమస్యలు గాలికి!

- గుమ్మళ్లదొడ్డిలో కోతులు, కుక్కలు, పందుల బెడద
- మంచినీటి ఎద్దడి.. అస్తవ్యస్తంగా డ్రైనేజీలు..
- పట్టించుకునే వారేరీ?

**గోకవరం (మనసులో మాట) అక్టోబర్ 16**

గోకవరం మండలంలోని 14 పంచాయతీల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. ఆయా రాజకీయ పార్టీల నాయకులు పదవుల వేటలో నిమగ్నమవుతుండగా, గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు మాత్రం పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్నామని చెబుతుండగా, నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలను పరిష్కరిస్తామని హామీలిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు నెలలుగా ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీల్లో సమస్యలు పేరుకుపోయాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**గుమ్మళ్లదొడ్డిలో భయాందోళనలు**

మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ఒకవైపు కార్పొరేట్ కంపెనీల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులకు, మరోవైపు కోతులు, కుక్కలు, పందుల బెడద తీవ్ర సమస్యగా మారింది. కోతుల దాడుల భయంతో పట్టపగలే బయటకు రావాలంటే ప్రజలు జంకుతున్న పరిస్థితి నెలకొంది. గురువారం సాయంత్రం గ్రామంలోని



వినాయకుడి ఆలయం సమీపంలో కోతుల దాడిలో నలుగురు వ్యక్తులు గాయపడటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

**విద్యార్థులు, చిన్నారులకు తప్పని భయం**

గ్రామ వీధుల్లో పందులు, కుక్కలు యథేచ్ఛగా సంచరిస్తుండటంతో విద్యార్థులు, చిన్నారులు భయాందోళనలకు గురవుతున్నారు. వీధుల్లోకి వెళ్లాలన్నా, పాఠశాలలకు రాకపోకలు సాగించాలన్నా ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధి కుక్కలు, పందులు, కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

**మంచినీటి సమస్యతో అవస్థలు**

గ్రామంలోని శెట్టిబలిజిపేట, దళితపేట ప్రాంతాల ప్రజలు మంచినీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ కార్యాలయం పక్కనే ఉన్న రామాలయం వద్ద మంచినీటి పైప్‌లైన్ దెబ్బతినడంతో నీరు వృథాగా పోతున్నా మరమ్మతులు చేపట్టకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో అందుబాటులో ఉన్న నీరు సైతం వృథా కావడం అధికారుల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

**డ్రైనేజీలతో దుర్భర పరిస్థితులు**

గ్రామంలో పలు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. గౌరీ సెంటర్ నుంచి శ్రీరామగిరి కొండ వైపు వెళ్లే మార్గంలో ప్రధాన రహదారిపైకి డ్రైనేజీ నీరు చేరుతుండటంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగునీటిని దాటుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొనడంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఎన్నికల తర్వాతే పరిష్కారమా?**

ఒకవైపు ఎన్నికల హడావుడి కొనసాగుతుండగా, మరోవైపు ప్రజల నిత్యజీవితాన్ని ప్రభావితం చేస్తున్న సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఎన్నికల విధుల పేరుతో అధికారులు, అధికారంలోకి వచ్చాక పరిష్కరిస్తామంటూ నాయకులు కాలయాపన చేస్తే సామాన్య ప్రజల సమస్యలు పరిష్కరించేది ఎవరనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. గుమ్మళ్లదొడ్డి గ్రామంలో నెలకొన్న సమస్యలతో పాటు మండలంలోని ఇతర గ్రామాల్లోనూ మౌలిక వసతుల సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఎన్నికల ఫలితాల కోసం ఎదురు చూడకుండా ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందిస్తారా? లేక కొత్త ప్రజాప్రతినిధులు బాధ్యతలు చేపట్టే వరకు ప్రజలు ఈ కష్టాలు భరించాల్సిందేనా? అన్నది వేచి చూడాలి

# ఆపరేషన్ త్రిశూల్‌లో భాగంగా కాకినాడ ఆర్టీసీ బస్టాండ్, లాడ్జీలలో పోలీస్ తనిఖీలు




**కాకినాడ (మనసులో మాట) అక్టోబర్ 16**

కాకినాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆపరేషన్ త్రిశూల్‌లో భాగంగా ఈగిల్ సెల్, కాకినాడ, కాకినాడ టూ టౌన్ పోలీస్ సిబ్బంది, ఆర్టీసీ శాఖ సిబ్బంది సంయుక్తంగా కాకినాడ ఆర్టీసీ బస్టాండ్, లాడ్జీలలో డాగ్ స్క్వాడ్ సహాయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలు, లాడ్జీలలో అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై తనిఖీలు చేపట్టి, లాడ్జీలలో బస చేస్తున్న వ్యక్తుల వివరాలను పరిశీలించారు. అలాగే అక్కడి ప్రజలతో మాట్లాడి, డ్రగ్స్‌కు సంబంధించిన ఎలాంటి సమాచారం తెలిసినా 1972 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అవగాహన కల్పించారు. డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టడమే లక్ష్యంగా ఈ తనిఖీలు నిర్వహించారు

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

# ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా, సమన్వయంతో నిర్వహించాలి

- ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులకు దిశానిర్దేశం
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**కాకినాడ (మనసులో మాట) అక్టోబర్ 16**






కాకినాడ జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, పురపాలక సంఘాల ఎన్నికల నిర్వహణకు సంబంధించి నోడల్ అధికారులు తమకు కేటాయించిన విధులు, బాధ్యతలను పూర్తి అవగాహనతో, సమన్వయంతో, జవాబుదారీతనం తో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు.

శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, పురపాలక సంఘాల ఎన్నికల నిర్వహణకు సంబంధించి నోడల్ అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఎన్నికల ప్రక్రియలో ప్రతి అంశాన్ని నిర్దేశిత కాల పరిమితిలో పూర్తి చేస్తూ, ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. నోడల్ అధికారులకు అప్పగించిన పనులు పూర్తి సమర్థతతో నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని సమస్యలు ఉన్నట్లయితే జిల్లా కలెక్టర్ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని స్పష్టం చేశారు.పోలింగ్ కేంద్రాల వారిగా ఓటర్ల జాబితాలు విభజించాలని అదేవిధంగా ఏ ఎస్ డి కాపీని, మార్క్స్ కాపీని రూపొందించాలని, ఓటర్ స్లిప్పులను ప్రింట్ చేయించి ఓటర్లకు పంపిణీ చేయాలన్నారు. నామినేషన్ల ఉపసంహరణ పూర్తయిన తదుపరి పోటీలో ఉన్న అభ్యర్థుల గుర్తులు కేటాయించి బ్యాలెట్ పేపర్ల ముద్రణ చేపట్టాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంపు, త్రాగునీరు మరుగుదొడ్డి విద్యుత్ సౌకర్యం రహస్య ఓటింగ్ కంపార్ట్మెంటు రూప కల్పన పై దృష్టి పెట్టాలన్నారు. పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు 9,900 మంది ఉద్యోగులను నియమించడం జరిగిందన్నారు ఫ్లయింగ్ సర్వే లెన్స్ స్క్వాడ్ స్టాటిస్టికల్ సర్వే లెన్స్ స్క్వాడ్లు నిర్దేశిత విధులు తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణ సమన్వయం, ముందస్తు ప్రణాళిక, నిరంతర పర్యవేక్షణతో కూడిన బాధ్యతాయుతమైన ప్రక్రియ అన్నారు. ఎన్నికలకు సంబంధించిన వివిధ విభాగాల మధ్య సమర్థవంతమైన సమన్వయం ఉండాలని, ప్రతి నోడల్ అధికారి తనకు అప్పగించిన బాధ్యతలను స్పష్టంగా అర్థం చేసుకుని కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు, నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నియమ నిబంధనలు,

**మార్గ దర్శకాలు, విధివిధా నాలపై నోడల్ అధి కారులు పూర్తి**

అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల సంఘం జారీ చేసే ఆదేశాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, వాటి ప్రకారం కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిర్ణీత సమయంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎన్నికల ప్రక్రియలో సిబ్బంది నియామకం, శిక్షణ, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, ఎన్నికల సామగ్రి సమీకరణ, రవాణా, భద్రత, సమాచార వ్యవస్థ, ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై సంబంధిత నోడల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు ప్రతి విభాగానికి సంబంధించిన పనుల పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ, అవసరమైన నివేదికలను సకాలంలో సమర్పించాలని ఆదేశించారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో అధికారులు నిష్పాక్షికంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు సంబంధించిన ఫిర్యాదులపై నిర్దేశిత విధానంలో స్పందించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అందే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా, వాటిని పరిశీలించి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు ముందస్తు తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ, భద్రపరచడం వంటి అంశాల్లో నిర్దేశిత విధివిధానాలను పాటించాలన్నారు ఎన్నికల సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించి, వారికి కేటాయించిన విధులపై స్పష్టత కల్పించాలన్నారు.ఎన్నికల నిర్వహణలో రెవెన్యూ, పోలీసు, పంచాయతీ రాజ్, మున్సిపల్ పరిపాలన, రవాణా, సమాచార వ్యవస్థలు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని, ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సంబంధిత అధికారుల తో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

**అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా**

ఎదుర్కొనేందుకు అవసరమైన సమాచార వ్యవస్థను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.ప్రతి నోడల్ అధికారి తనకు కేటాయించిన విభాగానికి సంబంధించిన పనుల పురోగతిని రోజువారీగా పర్యవేక్షించాలని ఆదేశించారు. నిర్ణీత గడువుల్లో పనులు పూర్తి చేస్తూ, అవసరమైన నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పాక్షికత, జవాబుదారీతనం, సమయపాలన ప్రధానమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. నోడల్ అధికారులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, అన్ని విభాగాలను సమన్వయం చేసుకుని ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా, అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు ఈ సమావేశంలో డిఆర్ఓ డాక్టర్ డి తిప్పే నాయక్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ వివి సత్యనారాయణ, పెద్దాపురం ఆర్డీవో పి కృష్ణమూర్తి, సిపిఓ పి త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ శ్రీనివాసరావు, ఎస్ జి ఎస్ డబ్ల్యు నోడల్ అధికారి జె వేణు గోపాల్, జిల్లా విద్యా శాఖ అధికారి పి రమేష్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జోతుల రాము, జడ్పి సీఈఓ లక్ష్మణరావు, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ సుధాకర్ జిజిహెచ్ నోడల్ అధికారి ఎన్ శ్రీధర్ , జి ఎం: డి ఐ సి సిహెచ్ గణపతి, తదితరులు పాల్గొన్నారు

# సరస్వతీ దేవి అలంకారంలో దర్శనమిచ్చిన శ్రీ కనకదుర్గమ్మ

- మూలా నక్షత్రం సందర్భంగా చిన్నారులతో సరస్వతీ పూజలు

**గోకవరం (మనసులో మాట) అక్టోబర్ 16**

మండల కేంద్రమైన గోకవరం దేవిచౌక్‌లోని, శ్రీ వీరభద్రుని గద్దెపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శుక్రవారం అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మూలా నక్షత్రం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు చిన్నారులతో సరస్వతీ పూజలు వైభవంగా జరిపించారు. ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథ శర్మ, కిట్టు శర్మ, కృష్ణ శర్మల ఆధ్వర్యంలో చిన్నారులు సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యకు అధిదేవత అయిన సరస్వతీ అమ్మవారిని ఆరాధించడం ద్వారా చిన్నారులకు జ్ఞానవృద్ధి, విద్యాభివృద్ధి కలగడంతో పాటు ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని



భక్తుల విశ్వాసమని అర్చకులు తెలిపారు. ప్రతి ఏటా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ చిన్నారులతో పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సరస్వతీ పూజలో పాల్గొన్న చిన్నారులకు ఆలయ సభ్యుల సహకారంతో అమ్మవారి ప్రతిమలు, పుస్తకాలు, పెన్నులు, రబ్బర్లు, బిస్కెట్ ప్యాకెట్లు, ఎగ్జామ్ ప్యాడ్లను అందజేశారు. అనంతరం చిన్నారులకు ప్రసాద వితరణ చేపట్టారు.

మూలా నక్షత్రం కావడంతో తెల్లవారుజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించి అమ్మవారి కృపాకటాక్షాలు పొందారు. చిన్నారుల సరస్వతీ పూజలు, భక్తుల ప్రత్యేక పూజలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అలాగే మండలం లోని రంప యర్రంపాలెం గ్రామంలోని గంగాభవాని నగర్‌లో కొలువై ఉన్న శ్రీదేవి అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు సరస్వతీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు

# పెద్దాపురం మున్సిపల్ చైర్మన్ కూటమి అభ్యర్థిగా సూరిబాబు రాజు

**పెద్దాపురం మనసులో మాట అక్టోబర్ 16**

పెద్దాపురం మున్సిపల్ ఎన్నికల్లో కూటమి చైర్మన్ అభ్యర్థిగా రాజా సూరిబాబు రాజు ఎంపికయ్యారు. శుక్రవారం సూరిబాబు రాజు తన వర్గీయులతో సామర్లకోట మండలం అచ్చంపేటలోని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే చినరాజప్పను సూరిబాబు రాజు కుమారుడు తో కలిసి సత్కరించారు. పార్టీ నుండి అధికారికంగా సూరిబాబు రాజును ఎంపిక చేసినట్లు ప్రకటన రావాల్సి ఉంది. కాగా శనివారం సూరిబాబు రాజు నామినేషన్ దాఖలు చేసేందుకు ఏర్పాటులు చేపట్టారు. పెద్దాపురం కు చెందిన తెలుగుదేశం పార్టీ నేతలు రంధీ సత్యనారాయణ, తూతిక రాజు, మార్ని చిన్న తదితరులు పాల్గొన్నారు



# స్థానిక సంస్థల ఎన్నికలకు వైసీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలి

- గాదెలపాలెం, ఇటికాయలపల్లిలో ఎన్నికల కార్యాచరణపై సమావేశాలు

**గోకవరం (మనసులో మాట) అక్టోబర్ 16**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులంతా ఐక్యంగా కృషి చేయాలని రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శ్రీరాంజీ పిలుపునిచ్చారు. శుక్రవారం గోకవరం మండలం గాదెలపాలెం, ఇటికాయలపల్లి గ్రామాల్లో వైసీపీ మండల అధ్యక్షుడు పాటి రాంబాబు ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల కార్యాచరణపై సమావేశాలు నిర్వహించారు. ఆయా గ్రామాల గ్రామ కమిటీ అధ్యక్షులు కమ్మిల వీరబాబు, పిల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాలకు తోట శ్రీరాంజీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. బీసీలకు రుణాలు మంజూరు చేయకుండా, సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. రైతులు, యువత, మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని కోరారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 2029 ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకు నేందు కు ఇప్పటి నుంచే అహర్నిశలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**పార్టీ ఐడీ కార్డుల పంపిణీ**

సమావేశంలో భాగంగా వివిధ పార్టీ అనుబంధ కమిటీల్లో నియమితులైన నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ఐడీ కార్డులు పొందిన ప్రతి ఒక్కరికీ పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని తోట శ్రీరాంజీ తెలిపారు. పార్టీ ఐడీ కార్డులు పొంది, వివిధ అనుబంధ కమిటీల్లో బాధ్యతలు నిర్వహిస్తూ మరణించిన నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించే కార్యక్రమానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు దాసరి చినబాబు, గుల్లా ఏడుకొండలు, సమ్మెట మోహన్, బదిరెడ్డి అప్పన్నదొర, మడికి మైనర్ బాబు, కమ్మిల అచ్చిబాబు, గునిపే ఏడుకొండలు, రౌతు జోగేశ్వరరావు, అంబటి అబ్రహం, దంగేటి వెంకటరత్నం, పాటి అప్పలరాజు, కూరకుల సుమంగళి, సీహెచ్ శివ, జలెం రాము, చిట్టిబాబు, నాగేశ్వరరావు, అప్పలకొండ, నాగు, శ్రీనుబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు

# శ్రీ సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చిన కాకరాపల్లి దుర్గమ్మ

**కోటనందూరు (మనసులో మాట)అక్టోబర్ 15**

కోటనందూరు మండలం కాకరాపల్లి గ్రామంలో ఉన్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో దసరా వేడుకలు ఘనంగా జరుగుచున్నవి. 6వ రోజు శ్రీ సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించగా వందలాది మంది భక్తులు వచ్చి దర్శనం చేసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకములు, అలంకరణ,హారతి అనంతరము సరస్వతి దేవి అలంకారంలో ఉన్న అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ రోజు పూజా కార్యక్రమంలో సుమారు రెండువేల మంది విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొనగా ఆలయ కమిటీ చైర్మన్ వాసం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు విద్యార్థులకు నోటు పుస్తకములు పెన్నులు పెన్సిల్ పంపిణీ చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ మూలా నక్షత్రం శుక్రవారం కావడంతో శ్రీ సరస్వతి దేవి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ప్రార్థించుకున్నారని విద్యాబుద్ధులు జ్ఞానం విజ్ఞానం సకల శుభాలు ప్రసాదించే తల్లిగా శ్రీ సరస్వతీ దేవిని కొలుస్తూ భక్తులు అమ్మవారి ఆశీస్సులు పొందారని తెలియజేశారు. ఇంత ఘనంగా జరుగుతున్న దేవి శరన్నవరాత్రి వేడుకలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ఆలయ కమిటీ చైర్మన్ వాసం నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలియజేశారు

# ఎస్సీ రిజర్వేషన్ల అమలులో చట్టబద్ధమైన అర్హతలను కచ్చితంగా పరిశీలించాలి

- కాకినాడ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన
- డాక్టర్ పిట్టా వరప్రసాద్

**కాకినాడ (మనసులో మాట) అక్టోబర్ 16**



ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) రిజర్వేషన్ల అమలులో రాజ్యాంగ నిబంధనలు, సంబంధిత చట్టాలు, న్యాయస్థానాల తీర్పులను కచ్చితంగా పాటించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి డాక్టర్ పిట్టా వరప్రసాద్ కోరారు. ఈ మేరకు కాకినాడ జిల్లా కలెక్టర్‌కు ఆయన వినతిపత్రం సమర్పించారు.

భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 341 కింద జారీ చేసిన కన్స్టిట్యూషన్ (షెడ్యూల్డ్ క్యాస్ట్స్ ) ఆర్డర్ 1950 లోని పేరా 3 ప్రకారం షెడ్యూల్డ్ కులాల హోదాకు సంబంధించిన చట్టబద్ధమైన అర్హతలను సంబంధిత అధికారులు పరిశీలించాలని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్లు చారిత్రకంగా సామాజిక వివక్షకు గురైన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు రాజ్యాంగం అందించిన కీలకమైన రక్షణ అని డాక్టర్ పిట్టా వరప్రసాద్ అన్నారు. ఈ రిజర్వేషన్ల ప్రయోజనాలు చట్టప్రకారం అర్హులైన వారికి అందేలా ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పాక్షికత ఉండాలని స్పష్టం చేశారు.ఎస్సీ రిజర్వుడ్ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన సమయంలో కుల ధ్రువీకరణ పత్రాలు, సంబంధిత చట్టబద్ధమైన అర్హతలను నిబంధనల ప్రకారం పరిశీలించేలా ఎన్నికల అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఉండాలని కోరారు. అదేవిధంగా ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాల జారీ సమయంలో సంబంధిత రెవెన్యూ అధికారులు చట్టాలు, నియమాలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా అనుసరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రత్యేకించి, క్రైస్తవ మతాన్ని స్వీకరించిన లేదా ఆచరిస్తున్న వ్యక్తులకు ఎస్సీ హోదా వర్తించే అంశాన్ని రాష్ట్రపతి ఉత్తర్వులు, 1950 లోని పేరా 3, సంబంధిత న్యాయస్థానాల తీర్పులు, వర్తించే చట్టాల ప్రకారం పరిశీలించాలని కోరారు.ఈ విషయంలో వ్యక్తిగత కేసుల వాస్తవాలు, వర్తించే చట్టపరమైన నిబంధనల ఆధారంగా సంబంధిత అధికారులు నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. తప్పుడు సమాచారం నకిలీ పత్రాలు లేదా చట్టవిరుద్ధంగా జారీ చేసిన ధ్రువీకరణ పత్రాల ఆధారంగా రిజర్వేషన్ ప్రయోజనాలు పొందినట్లు ఫిర్యాదులు అందితే, వాటిపై నిష్పాక్షిక విచారణ జరిపించి చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

**డాక్టర్ పిట్టా వరప్రసాద్ చేసిన ప్రధాన విజ్ఞప్తులు**

ఎస్సీ రిజర్వుడ్ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల అర్హతలను నిబంధనల ప్రకారం పరిశీలించాలి.

కుల ధ్రువీకరణ పత్రాల జారీలో చట్టబద్ధమైన ప్రమాణాలను పాటించాలి.

రాష్ట్రపతి ఉత్తర్వులు, 1950లోని పేరా 3 తో పాటు వర్తించే న్యాయస్థానాల తీర్పులను పరిగణనలోకి తీసుకోవాలి.

తప్పుడు ధ్రువీకరణ పత్రాలపై వచ్చే ఫిర్యాదులను నిష్పాక్షికంగా విచారించాలి.

చట్టబద్ధంగా అర్హులైన షెడ్యూల్డ్ కులాల ప్రజలకు రాజ్యాంగబద్ధమైన రాజకీయ ప్రాతినిధ్యం అందేలా చర్యలు తీసుకోవాలి.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్ల అమలుపై సంబంధిత అధికారులు చట్టబద్ధమైన మార్గదర్శకాలను పాటిస్తూ, అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసు కోవాలని డాక్టర్ పిట్టా వరప్రసాద్ కాకినాడ జిల్లా కలెక్టర్‌కు సమర్పించిన వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు

# మహాశక్తి యాగంలో భక్తిభావం తో కుంకుమార్చనలు

- బగళాముఖిగా దర్శనమిచ్చిన ఐశ్వర్యాంబిక అమ్మవారు

**కాకినాడ (మనసులో మాట) అక్టోబర్ 16**

మహాశక్తి యాగం లో భాగంగా నిర్వహిస్తున్న వంద కోట్ల కుంకు మార్చన కార్యక్రమం ఆరో రోజుకు చేరుకుంది. వేలాది మంది భక్తులు అమ్మవారి సహస్రనామాలను స్మరిస్తూ భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలో పాల్గొంటున్నారు. ఇప్పటి వరకు సుమారు 43 కోట్ల కుంకుమార్చనలు పూర్తయినట్లు పూజ్యశ్రీ పరిపూర్ణానంద స్వామివారు వెల్లడించారు. నిర్ణీత లక్ష్యాన్ని చేరుకునే దిశగా భక్తులు మరింత ఉత్సాహం తో ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. కాకినాడ శ్రీ పీఠంలో జరుగు తున్న మహాశక్తి యాగం కార్యక్రమం శుక్రవారం కూడా ఎంతో ఘనంగా జరిగింది. శ్రీపీఠంలో వేంచేసియున్న ఐశ్వర్యంబికా అమ్మవారు శ్రీ బగళాముఖి దేవిగా దర్శనం ఇచ్చారు. భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. మహాశక్తి యాగం ప్రాంగణంలో ప్రతిరోజూ నిర్వహిస్తున్న పూజలు, హోమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తిభావ వాతావరణం నెలకొంది. నవరాత్రుల్లో చివరి మూడు రోజులు మహత్తరమైనవని స్వామి వారు వివరించారు. మహాసరస్వతీ దేవి, మహాదుర్గ, మహాలక్ష్మి రూపాల్లో అమ్మవారిని ఆరాధించే ఈ రోజుల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. నవమి రోజున మహాపూర్ణాహుతి నిర్వహించనున్నట్లు తెలిపారు.



కుంకుమార్చనలో భక్తులు తమ సంకల్పాన్ని కొనసాగిస్తూ, క్రమశిక్షణతో పూజల్లో పాల్గొనాలని సూచించారు. ఇప్పటి వరకు సుమారు 43 కోట్ల కుంకు మార్చనలు పూర్తయ్యాయని, రానున్న రోజుల్లో మరింత మంది భక్తులు పాల్గొనే అవకాశముందని చెప్పారు. యాగ ప్రాంగణంలో బగళాముఖి అమ్మవారి దర్శనానికి భక్తులకు అవకాశం కల్పించారు. దర్శనం చేసుకోని వారు వెళ్లే సమయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రసాదం స్వీకరించాలని స్వామివారు సూచించారు. సాయంత్రం 6.30 గంటల నుంచి బగళాముఖి, ప్రత్యంగిరా, వారాహి అమ్మవార్లకు ప్రత్యేక హోమాలతోపాటు ఐశ్వర్యాంబిక అమ్మవారి మూలమంత్రం, పరమశివుడు, ఇష్టసిద్ధి గణపతి, కష్టహర కార్తికేయ స్వామివార్లకు సంబంధించిన హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం హారతి, భజన కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు.కుంకుమార్చన అనంతరం భక్తులు కొన్ని క్షణాలు మౌనంగా కూర్చుని అమ్మవారిని ధ్యానించాలని స్వామివారు సూచించారు. ఇప్పటివరకు కుంకుమను సమర్పించిన భక్తులు, ఇప్పుడు తమను తాము అమ్మవారి పాదాలకు సమర్పించు కోవడమే ఆత్మసమర్పణ అని వివరించారు.

అమ్మవారిపై భక్తి కేవలం మాటల్లో కాకుండా హృదయాంతరాళం నుంచి రావాలని, ఆ భక్తి ప్రకృతి పట్ల ప్రేమగా, సమాజం పట్ల బాధ్యతగా, ఇతరుల పట్ల సేవాభావంగా ప్రతిఫలించాలని సందేశమిచ్చారు. మహాశక్తి యాగం చివరి మూడు రోజుల్లో నిర్వహించ నున్న ప్రధాన కార్యక్రమాల్లో భక్తులంతా భాగస్వాములు కావాలని, శ్రీ పీఠం కార్యాలయాన్ని సంప్రదించి ఐశ్వర్య దీప పూజ, నవశక్తి హోమం వివరాలు తెలుసుకోవాలని పరిపూర్ణానంద స్వామి పిలుపు నిచ్చారు.

# శ్రీ మధ్వజయంతి రాష్ట్ర పండుగగా కర్ణాటక నిర్ణయం

**కాకినాడ (మనసులో మాట) అక్టోబర్ 16**

శ్రీ మధ్వాచార్య జయంతిని అక్టోబర్ 21 వ తేది న రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు కర్ణాటక ప్రభుత్వం నిర్ణయిస్తూ ప్రత్యేక జీవోని జారీ చేయడం పట్ల ఆంధ్ర మధ్వ సమాఖ్య కమిటీ కాకినాడ మధ్వసభ కమిటీ సంయుక్తంగా హర్షాన్ని వ్యక్తం చేసింది. కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కు ప్రత్యేక అభినందనలు తెలుపుతూ శ్రీ మధ్వాచార్యులు జన్మించిన ప్రాంతం కూడా కర్ణాటక రాష్ట్రం లోని ఉడిపి సమీపాన ఉన్న పాజిక క్షేత్రంగా ప్రస్తావిస్తూ ఈ ప్రాంత అభివృద్ధికి కూడా ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. పాజక క్షేత్రాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాల్సిందిగా కోరుతూ ఈ ప్రాంతంలో సంస్కృత విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. పాజక క్షేత్ర పరిసర ప్రాంతాల్లో పరుశురాముడు సృష్టించినవిగా ప్రసిద్ధి చెందిన నాలుగు తీర్థాలను ప్రభుత్వం అభివృద్ధి చేయడం ద్వారా వాటి పవిత్రత, చారిత్రక ప్రాముఖ్యత, ఆధ్యాత్మిక విశిష్టత రానున్న తరాల వారికి తెలుసు కోవడానికి ఎంతో వీలు ఉంటుందని, దానికోసం విస్తృత



ప్రచారం కూడా కల్పించాల్సిన అవసరం ఉందని కోరారు.

శ్రీమద్వాచార్యుల వారి జయంతిని జాతికిస్థాయిలో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రత్యేకంగా కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేయాల్సిందిగా కోరారు. కర్ణాటక ప్రభుత్వం మధ్వజయంతి ని కేవలం ఒక ఉత్సవంగా మాత్రమే కాకుండా తత్వ జ్ఞానం, ఆధ్యాత్మికత, సంస్కృతి,విద్య,సామాజిక సంక్షేమాన్ని ప్రోత్సహించే ఒక విశిష్ట కార్యక్రమంగా నిర్వహించాల్సిందిగా కమిటీ సభ్యులు మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేశారు.శ్రీమద్వాచార్యులు వారు దేశవ్యాప్తంగా సంచరించడమే కాక అనేక పుణ్యక్షేత్రాల లో వారి జ్ఞాపకాలు నేటి తరానికి తెలుసుకొనేందుకు అవకాశం ఉంటుందని సూచించారు. బదిరి వంటి పుణ్యక్షేత్రంలో శ్రీమద్వాచార్యులు వారు నేటికీ నివాస ముంటున్నట్లు అనేక గ్రంథాల ద్వారా అవగతం అవుతున్నాయని వారు ప్రస్తావించారు. కార్యక్రమంలో ఆంధ్ర మధ్వ సమాఖ్య ప్రతినిధి బృందం జమ్మి వెంకట కృష్ణారావు, కందాల నరసింహారావు,కాకలవరపు భరణి కుమార్,మజుందర్ రామారావు, సాలవ పంతులు రాఘవేంద్రరావు,చట్టి హనుమంతరావు,డాక్టర్ యాతగిరి పరశురాం,రాచూరి శేషగిరిరావు,చిల్లరిగా వెంకట అన్నాజీ రావు, న్యాపతి రవీందర్, కోపల్లె రామకృష్ణ, కాకినాడ మధ్యసభ కమిటీ అధ్యక్షుడు కోపెల్లె శేషగిరిరావు, కార్యదర్శి రాచూరు శేషగిరిరావు, సంయుక్త కార్యదర్శి డాక్టర్ పరశురామ్, కోశాధికారి వేముగంటి రామ నరసింహారావు, యాతగిరి మద్వేష్ పలువురు అభినందన తెలిపిన వారిలో ఉన్నారు.

# ప్రపంచ అనస్థీషియా దినోత్సవం సందర్భంగా

- **మెడికవర్ హాస్పిటల్స్‌లో అవగాహన కార్యక్రమం**

**కాకినాడ (మనసులో మాట) అక్టోబర్ 16**



ప్రపంచ అనస్థీషియా దినోత్సవం సందర్భంగా కాకినాడ మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అనస్థీషియా వైద్య సేవల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ కిషోర్ బాబు మాట్లాడుతూ, శస్త్రచికిత్సల సమయంలో రోగికి నొప్పి తెలియకుండా చూడటంతో పాటు, రోగి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడం లో అనస్థీషియా వైద్యుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. శస్త్రచికిత్సకు ముందు రోగి ఆరోగ్య పరిస్థితిని అంచనా వేయడం, శస్త్రచికిత్స సమయంలో గుండె స్పందన, రక్తపోటు, శ్వాస వంటి కీలక అంశాలను పర్యవేక్షించడం, శస్త్రచికిత్స అనంతరం రోగి కోలుకునే వరకు అవసరమైన వైద్య సహాయం అందించడం వంటి బాధ్యతలను అనస్థీషియా వైద్యులు నిర్వహిస్తారని వివరించారు.

అనస్థీషియా సేవలు కేవలం శస్త్రచికిత్సలకే పరిమితం కాకుండా అత్యవసర వైద్యం, క్రిటికల్ కేర్, నొప్పి నివారణ వంటి విభాగాల్లోనూ కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. రోగుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, ఆధునిక వైద్య విధానాలతో నాణ్యమైన సేవలు అందించేందుకు అనస్థీషియా విభాగం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ సెంటర్ హెడ్ ఎన్. ఆంజనేయస్వామి(అంజిబాబు ) మాట్లాడుతూ, రోగుల భద్రతలో అనస్థీషియా వైద్యుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. శస్త్రచికిత్సకు ముందు నుంచి, శస్త్రచికిత్స పూర్తయి రోగి కోలుకునే వరకు అనస్థీషియా వైద్యులు నిరంతరం పర్యవేక్షణ అందిస్తూ కీలక సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఆధునిక వైద్య సాంకేతికతను వినియోగించు కుంటూ రోగులకు సురక్షితమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడమే మెడికవర్ హాస్పిటల్స్ లక్ష్యమని తెలిపారు. అనస్థీషియా వైద్య సేవలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా శస్త్రచికిత్సల పట్ల ఉన్న అపోహలను తొలగించి, రోగుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించవచ్చని ఆయన అన్నారు.ఈ కార్యక్రమం ద్వారా అనస్థీషియా వైద్యుల సేవలు, రోగుల భద్రతలో వారి ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆసుపత్రి ప్రతినిధులు పేర్కొన్నారు

# నూజివీడు వైసీపీ చైర్ పర్సన్ అభ్యర్థిగా లవ కుమార్

**నూజివీడు(మనసులో మాట) అక్టోబర్ 16:**

నూజివీడు పట్టణంలో త్వరలో నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికలలో చైర్మన్ వైసీపీ అభ్యర్థిగా కంచర్ల లవకుమార్ పేరు ఖరారు అయింది. ద్వారక ఎస్టేట్స్ లో శుక్రవారం రాత్రి పార్టీ శ్రేణులతో చర్చించి లవ కుమార్ పేరును మాజీ ఎమ్మెల్యే మేక వెంకట ప్రతాప్ అప్పారావు ఖరారు చేశారు. పట్టణంలోని 36 వార్డులకు సంబంధించి పార్టీ కౌన్సిల్ అభ్యర్థుల పేర్లు ఖరారు కావలసి ఉంది. ఇదిలా ఉండగా అధికార తెలుగుదేశం పార్టీ ఇప్పటి వరకు చైర్మన్ అభ్యర్థిని ప్రకటించలేదు. రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణులతో మంతనాలు కొనసాగిస్తున్నారు.



# ఏలేశ్వరం లో టిడిపి కి గుడ్ బై....



- **ముద్రగడ సమక్షంలో వై సి పి లోకి పలువురు చేరిక**

**ఏలేశ్వరం (మనసులో మాట) అక్టోబర్ 16**

ఏలేశ్వరం పురపాలక సంఘము పరిధిలో లో ఉన్న టి డి పి ని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లోకి భారీ గా చేరికలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా

సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్ బూర్లు సత్యనారాయణ, సత్యవతి టీడీపీ పార్టీ వీడి వైసీపీ లో శుక్రవారం చేరారు, వీరికి ముద్రగడ గిరిబాబు పార్టీ కండువా వేసి వారిని ఆహ్వానించారు.

వీరితో పాటు పట్టణానికి చెందిన ధనేటి చిన్నారావు, తన అనుచరులకు వైసీపీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఏలేశ్వరం మున్సిపాలిటీ లో వైసీపీ బలోపేతానికి కృషి చేస్తామని వారు ఈ సందర్భంగా తెలిపారు. గిరిబాబు మాట్లాడుతూ ఏలేశ్వరం పట్టణం లో వైయస్సార్ పార్టీకి ఆకర్షితులై శుక్రవారం పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వైసిపి పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని పిలుపు నిచ్చారు, ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వర రావు, బదిరెడ్డి గోవింద్, సుంకర రాంబాబు, సామంతుల సూర్య కుమార్, భలే కిషోర్, జువ్విన వీర్రాజు కోరాడ ప్రసాద్, రెడ్డి సత్యనారాయణ, రాచర్ల రమేష్, పలువురు వైసిపి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు



# పెద్దాపురంలో పోలీసులు కవాతు

- **ఎన్నికలకు భారీ భద్రత;**
- **డిఎస్పీ తిలక్**

**పెద్దాపురం (మనసులో మాట) అక్టోబర్ 16;**



పెద్దాపురం డి.ఎస్.పి బాలగంగాధర్ తిలక్, సీఐ వై ఆర్ కే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీస్ బలగాలు శుక్రవారం పెద్దాపురం లో భారీ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికలు, మండల పరిషత్ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రశాంతంగా ఎన్నికల నిర్వహించేందుకు పోలీస్ కవాతు నిర్వహించినట్లు డి.ఎస్.పి బాల గంగాధర్ తిలక్ తెలిపారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు పెద్దాపురం డివిజన్ పరిధిలో ఎన్నికల కోసం భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రశాంతంగా జరిగేలా పోలీసులకు సహకరించాలని డిఎస్పీ తిలక్ కోరారు. అవాంఛనీయ ఘటనకు పాల్పడితే చర్యలు తప్పవని డిఎస్పీ హెచ్చరించారు. పెద్దాపురం రూరల్ పరిధిలోని కట్టమూరు తదితర గ్రామాల్లో కూడా పోలీసులు ర్యాలీ నిర్వహించినట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ వై ఆర్ కే శ్రీనివాసరావు తెలిపారు. పెద్దాపురం ఎస్ఐ పాపారావు పోలీస్ బలగాలు ర్యాలీలో పాల్గొన్నాయి

# ఎంపీ ఉదయ శ్రీనివాస్ సమక్షంలో జనసేన పార్టీలో భారీ చేరికలు






**కోటనందూరు (మనసులో మాట) అక్టోబర్ 15**

కోటనందూరులో ఎంపీ తంగెళ్ళ ఉదయ శ్రీనివాస్ సమక్షంలో కోటనందూరు మండలం నుండి సుమారు 250 కుటుంబాలు జనసేన పార్టీలో చేరారు. కోటనందూరు లో జరిగిన జనసేన పార్టీ ఆత్మీయ సమావేశంలో మండల పార్టీ ప్రెసిడెంట్ పెదపాత్రుని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సీనియర్ నాయకులు యనమల కృష్ణుడు, పొల్నాటి శేషగిరిరావు, తుని మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థిని మళ్ళ మీనాక్షి, చోడిశెట్టి గణేష్ లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త పోపూరి రాజారావు, షేక్ మీరాబాయి, అల్లంపల్లి నరసింహామూర్తి, దార్ల సూర్యచంద్ర, ఏనుగుపల్లి ప్రవీణ్ మరియు 250 కుటుంబాలకు ఎంపీ ఉదయ శ్రీనివాస్ జనసేన కండవాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీనివాస్ మాట్లాడుతూ తుని నియోజకవర్గంలో జనసేన పార్టీకి గొప్ప అనుభవం గల నాయకుడు మనకు ఉన్నారని ఈయన ద్వారా జనసేన పార్టీ బలపడుతుందని నిస్వార్ధంగా పనిచేస్తున్న జన సైనికులకు యనమల కృష్ణుడు అండగా ఉంటారని కాకినాడలో మన కార్యకర్తలకు ఏ అవసరం ఉన్న మన క్యాంపు కార్యాలయానికి వచ్చి సమస్యలు తెలియజేస్తే పరిష్కరిస్తామని, కాకినాడ ఆసుపత్రి పనిమీద వచ్చిన వారికి అన్ని సౌకర్యాలు ఉంటాయని తెలియజేశారు. యనమల కృష్ణుడు మాట్లాడుతూ జనసేనకు రాష్ట్ర వ్యాప్తంగా ఆదరణ లభిస్తుందని, భారత ప్రధాని మెచ్చిన నాయకుడు మన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అని, పంచాయతీల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని, కోటనందూరు మండలాన్ని జనసేన మండలం గా తీర్చిదిద్దుతామని, అందరికీ అందుబాటులో ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అల్లు లవ రాజు, పెనుముచ్చి ప్రవీణ్, అంకారెడ్డి రాజశేషు, అడపా వీర కృష్ణ, పెనుముచ్చు నాగూర్, అల్లు రాజబాబు, నక్కా రామకృష్ణ పెద్ద సంఖ్యలో జనసైనికులు పాల్గొన్నారు

# ఏలేశ్వరం పురపాలక సంస్థ చైర్‌పర్సన్ గా వైసీపీ అభ్యర్థిగా

- **బదిరెడ్డి ఆశలత గోవింద్**
- **నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు ప్రకటన**

**ఏలేశ్వరం (మనసులో మాట) అక్టోబర్ 16**

ఏలేశ్వరం పురపాలక సంస్థ చైర్‌పర్సన్ అభ్యర్థిగా బదిరెడ్డి ఆశలత గోవింద్ పేరును వైసీపీ అధిష్టానం గురువారం రాత్రి ఖరారు చేసింది. రాష్ట్ర అధిష్టానం ఆదేశాల మేరకు పార్టీ ప్రత్తిపాడు నియోజక వర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు ఆమె అభ్యర్థిత్వాన్ని శుక్రవారం ప్రకటించారు.బదిరెడ్డి ఆశలత గతంలో కౌన్సిలర్ గా, అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలి గా పనిచేశారు. ప్రస్తుతం ఏలేశ్వరం పట్టణ వైసీపీ మహిళా అధ్యక్షురాలి గా కొనసాగుతున్నారు. ఆమె భర్త బదిరెడ్డి గోవింద్ వైసీపీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శిగా పనిచేస్తుండగా, గతంలో ఆయనతో పాటు ఆశలత అత్త బదిరెడ్డి వెంకట రమణమ్మ కూడా కౌన్సిలర్లుగా సేవలందించారు.






గత నగర పంచాయతీ ఎన్నికల్లో పాలకవర్గం విజయంలో బదిరెడ్డి గోవింద్ కీలక పాత్ర పోషించారు. పట్టణం లోని వివిధ వర్గాలతో ఆయనకు ఉన్న పరిచయాలు, ప్రజలతో సత్సంబంధాలు ఉన్నాయి. బదిరెడ్డి కుటుంబానికి రాజకీయంగా బలంగా నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అనుభవం, స్థానిక పరిచయాలు, కుటుంబ రాజకీయ నేపథ్యాన్ని పరిగణన లోకి తీసుకుని బదిరెడ్డి ఆశలత గోవింద్‌ను చైర్‌పర్సన్ అభ్యర్థిగా వైసీపీ ప్రకటించడం ఏలేశ్వరం మున్సిపల్ వైసిపి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు, సుంకర రాంబాబు, సామంతుల సూర్యకుమార్, ధలే కిషోర్ ,జువ్విన వీర్రాజు, కోరాడ ప్రసాద్, రెడ్డి సత్యనారాయణ, సఖిరెడ్డి బుజ్జి, పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

# కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయండి

- **జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపికపై అభిప్రాయ సేకరణ**

**కాజులూరు (మనసులో మాట) అక్టోబర్ 16**

స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయడంతో పాటు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపికపై కార్యకర్తల అభిప్రాయాలను సేకరించేందుకు శనివారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ పిల్లి కృష్ణమూర్తి తెలిపారు.
రామచంద్రపురంలోని పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం 5 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం పిల్లి కృష్ణమూర్తి, పార్టీ నియోజకవర్గ మేధావుల ఫోరం కన్వీనర్ తాడి వాసురెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ సుబ్రహ్మణ్యం తదితర నాయకులు మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి పార్టీ కార్యకర్తలను, అభిమానులను సమావేశానికి ఆహ్వానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు కృష్ణమూర్తి వివరించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిల్లి సూర్య ప్రకాశ్ తదితర నాయకులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని తెలిపారు. కాజులూరు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పిల్లి కృష్ణమూర్తి పిలుపునిచ్చారు.



# శ్రీ పీఠం ఐశ్వర్యాంబిక అమ్మవారికి యాలకుల దండ

- **అన్నదానానికి టన్నుకు పైగా కాయగూరలు అందజేత**

**తాళ్ళరేవు (మనసులో మాట) అక్టోబర్ 16:**

కాకినాడలో ప్రసిద్ధమైన శ్రీ పీఠంలో వేంచేసి ఉన్న శ్రీ ఐశ్వర్యాంబిక అమ్మవారికి పిల్లంక వేద పండితులు వేలూరి వెంకట కామేశ్వర శర్మ (కాశిబాబు) యాలకుల దండను బహుకరించారు. కాకినాడ శ్రీ పీఠంలో పూజ్యశ్రీ పరిపూర్ణానంద స్వామి వారి ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న మహాశక్తి యాగంలో భాగంగా అమ్మవారికి అలంకరించేందుకు స్వయంగా కాశిబాబు అరకిలో యాలకులచే శ్రీ సూక్త పారాయణ చేస్తూ యాలకుల దండను తయారు చేశారు. ఈ దండను శుక్రవారం అందజేయగా స్వామీజీ అమ్మవారికి అలంకరించారు. అదేవిధంగా మహాశక్తి యాగానికి విచ్చేస్తున్న వేలాది మంది భక్తులకు అన్న సంతర్పణ నిమిత్తం పిల్లంక పరిసర గ్రామాల భక్తజనుల సహకారంతో సుమారు 600 కిలోల వంకాయలు 400 కిలోల బంగాళదుంపలు అదేవిధంగా సాంబార్ లోకి 100 కిలోల కాయగూరలు 40 కిలోల పచ్చిమిర్చిని అందజేశారు. వీటిని శనివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో వినియోగించనున్నారు.



# ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావివ్వొద్దు

(మొదటిపేజీ తరువాయి)

అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రసంగిస్తూ ఎన్ని కల నిర్వహణ లో ప్రతి దశ కీలకమైనందున, ఎన్నికల విధులకు నియ మితులైన రిటర్నింగ్ అధికారులు సహాయ రిటర్నింగ్ అధికారులు ఎంపీడీవోలు ఎన్నికల మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ సమన్వయంతో పని చేయాలన్నారు. పోలింగ్ సిబ్బందికి రెండు దఫాలు శిక్షణను నిర్వహించి పోలింగ్ ప్రక్రియను పగడ్బందీగా నిర్వహించారు. నిష్పక్షపాతం నిజాయితీగా ఎన్నికల నిర్వహించి ప్రజా విశ్వాసాన్ని. నమ్మకాన్ని పొందాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి అపనమ్మకానికి, పొరపాట్లకు, నిర్లక్ష్యానికి తావులేకుండా పనిచేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల పాత్ర అత్యంత కీలకమన్నారు ఎన్నికల నోటిఫికేషన్ నుంచి నామినేషన్ల స్వీకరణ, నామినేషన్ల పరిశీ లన, ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా రూపకల్పన, పోలింగ్ నిర్వహణ, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశలోనూ ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గ దర్శకాలను తప్పకుండా అమలు చేయాలని సూచిం చారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో అభ్యర్థులు సమర్పించే పత్రాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలని, నిర్ణీత గడువులు, విధి విధానాలను



కచ్చితంగా పాటించాలని తెలిపారు.

నామినేషన్ల పరిశీలన సమయంలో అర్హతలు, అనర్హతలకు సంబంధించిన నిబంధనలను పూర్తిగా అవగాహన చేసుకుని, సంబంధిత చట్టాలు, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

అభ్యర్థుల నామినేషన్ల అంగీకారం లేదా తిరస్కరణ విషయంలో నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించడంతోపాటు అవసరమైన రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రిని ముందుగానే సిద్ధం చేసుకుని, వాటి స్వీకరణ, భద్రపరచడం, పంపిణీ ప్రక్రియలను పక్కాగా నిర్వహించాలన్నారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, చెరిగిపోని సిరా, పోలింగ్‌కు సంబంధించిన ఫారాలు, రిజిస్టర్లు, ఇతర ఎన్నికల సామగ్రిని నిర్దేశి త జాబితా చెక్ లిస్ట్ ప్రకారం సరఫరా చేయా లన్నారు ఎన్నికల సామగ్రి పంపిణీ సమయంలో సం బంధిత పోలింగ్ కేంద్రాలకు అవ సరమైన వస్తువులన్నీ సక్రమంగా చేరేలా ముందస్తు తని ఖీలు నిర్వహించాలని, సామగ్రి కొరత లేదా ఇతర సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రిటర్నింగ్ అధికారుల విధుల నిర్వహణకు అవస రమైన హ్యాండ్‌బుక్‌లను సంబంధిత ఎంపీడీవో కార్యాలయాల నుండి స్వీకరించి వాటిని సంబంధిత రిటర్నింగ్ అధికారులకు అందజేసి, శిక్షణా కార్యక్రమంలో వాటి విని యోగంపై పరిపూర్ణమైన అవ గాహన కల్పించారన్నారు ఎన్నికల విధుల నిర్వహ ణలో హ్యాండ్‌బుక్‌లలోని సూచనలు, ఎన్నికల సంఘం జారీ చేసే తాజా ఆదేశాలను అనుసరిం చాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించా రు. ఎన్నికల ప్రక్రియలో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీలు నిబంధనలను పాటిం చేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వ యంత్రాంగం నిష్పాక్షికంగా వ్యవహరిం చాలని, ఏ అభ్యర్థికి లేదా రాజకీయ పార్టీకి అను కూలంగా వ్యవహరించరా దని స్పష్టం చేశారు.ఎన్నికల ప్రవర్తనా నియ మావళి ఉల్లంఘనలకు సంబంధించిన ఫిర్యా దులు అందిన వ్పుడు వాటిని నిర్దేశిత విధా నంలో పరిశీలించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించు కునేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎన్నికల విధులకు సంబంధించిన సందే హాలను ముందుగానే నివృత్తి చేసుకుని, అవసరమైన మార్గదర్శకాలను అనుసరిస్తూ ప్రతి దశలో అప్రమత్తంగా ఉండాలన్నారు.ఎన్నికల నిర్వహణలో చిన్నపాటి నిర్లక్ష్యానికి కూడా అవకాశం ఇవ్వ కుండా, చట్టబద్ధత, పారదర్శకత, నిష్పాక్షికత, సమయపాలనకు ప్రాధాన్య తనిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని అధికారులు స్పష్టం చేశారు. ప్రజా స్వామ్య ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం పెంపొందించేలా, అర్హులైన ప్రతి ఓటరు స్వేచ్ఛగా తన ఓటు హక్కును విని యోగించుకునే వాతా వరణాన్ని కల్పిం చేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో సహాయ కలెక్టర్ కుమారి ప్రియ, జెడ్పి సీఈఓ లక్ష్మణ రావు, ఆర్డిఓ ఎస్ మల్లి బాబు, జడ్పీ డిప్యూటీ సీఎం శ్రీ లలిత ఎంపీ డీవోలు రిటర్నింగ్ సహాయ రిటర్నింగ్ అధికా రులు తదితరులు పాల్గొన్నారు.

## ఖరీఫ్ 202627 ధాన్యం సేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి పారదర్శకత తో నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)



పౌరసరఫరాల శాఖ, ఇతర శాఖల అధికారులతో కలిసి జిల్లాలోని రైస్ మిల్లుల యజమానులు, ప్రతినిధులతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ 292627 ధాన్యం సేకరణకు సంబంధించి రైస్ మిల్లర్లు బ్యాంక్ గ్యారెంటీ, అగ్రిమెంట్లు సమర్పించడం, రైతులకు సరిపడా గోను సంచులు సరఫరా, రైస్ మిల్లర్ల వద్ద ధాన్యం బస్తాలు దింపుటకు కూలీల సంఖ్య పెంచడం వంటి అంశాలపై జేసీ అపూర్వ భరత్ రైస్ మిల్లర్లతో చర్చించి, జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా సాగేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ధాన్యం సేకరణలో ఎలాంటి ఆలస్యం జరగకుండా రైస్ మిల్లర్లు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైస్ మిల్లర్లు తక్షణమే నిబంధనల ప్రకారం బ్యాంక్ గ్యారెంటీలు సమర్పించడంతో పాటు ఒప్పంద ప్రక్రియలను పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన గోనె సంచులను ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అందుబాటులో ఉంచాలని, మిల్లుల వద్ద వాహనాల రద్దీ సమస్యలు తలెత్తకుండా, ధాన్యం బస్తాలు దింపుటకు అవసరమైన హమాలీలు సంఖ్యను పెంచి త్వరితగతిన ఖాళీ చేయించాలని మిల్లర్లకు జేసీ దిశానిర్దేశం చేశారు. రైతులు పండించిన పంటను మద్దతు ధరకు విక్రయించుకునేలా అధికారులు, రైస్ మిల్లర్లు సమన్వయం తో పనిచేయాలని జేసీ సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పనిచేసే రైస్ మిల్లర్లపై కఠినంగా వ్యవహరించడం జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను పారదర్శకంగా, జాప్యం లేకుండా జరిగేలా చూడాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.ఆనందరావు, డీఎస్వో టి.ప్రసన్నలక్ష్మి దేవి, డీసీవో శ్రీనివాసు రెడ్డి, వ్యవసాయ అధికారి వీటీ.రామారావు, జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ నున్న రామకృష్ణ, ఇతర రైస్ మిల్లులు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతీ దేవి అవతారంలో వాసవి అమ్మవారు

- **108 మంది భక్తుల కలశాల ఊరేగింపు**

**మండపేట (మనసులో మాట) అక్టోబర్ 16**



సింహవాహనంపై అమ్మవారు, రజత పల్లకిలో సువర్ణమూర్తి మూలా నక్షత్రం, శుక్రవారం సందర్భంగా శ్రీ చక్ర సహిత వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు సరస్వతీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి గ్రామోత్సవ సేవలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక ఊరేగింపు భక్తులను ఆకట్టుకుంది.ఈ సందర్భంగా 108 మంది వాసవి అమ్మవారి భక్తులు కలశాలను ధరించి భక్తిశ్రద్ధలతో ఊరేగింపులో పాల్గొన్నారు. సింహవాహనంపై వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని, రజత పల్లకిలో సువర్ణమూర్తిని ఊరేగిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అమ్మవారి అలంకరణ, కలశాల ఊరేగింపు, పల్లకీ సేవ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆధ్యాత్మిక వాతావరణంలో సాగిన ఈ గ్రామోత్సవ కార్యక్రమం అమ్మవారి భక్తుల్లో భక్తిభావాన్ని నింపింది. ఆర్యవైశ్య సంఘం, వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని భక్తులు కోరారు.

## ఎన్నికల ప్రచార ప్రింటింగ్‌పై కలెక్టర్ హెచ్చరిక

(మొదటిపేజీ తరువాయి)

కీర్తి చేకూరి సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముద్రణ, ప్రచురణ వివరాలు తప్పనిసరి ఎన్నికల ప్రచారానికి వినియోగించే కరపత్రాలు, పోస్టర్లు, హ్యాండ్‌బిల్లులు తదితర ముద్రిత ప్రచార సామగ్రిపై ముద్రించిన వారి పేరు, చిరునామాతో పాటు ప్రచురణకర్త పేరు, చిరునామా స్పష్టంగా ఉండాలి. ప్రచార సామగ్రిని ముద్రించే ముందు ప్రచురణకర్త నుంచి నిర్దేశిత నమూనాలో రాతపూర్వక ప్రకటన తీసుకోవాలి. ఆ ప్రకటనపై ప్రచురణకర్త సంతకంతో పాటు, ఆయనకు వ్యక్తిగతంగా తెలిసిన ఇద్దరు వ్యక్తుల ధ్రువీకరణ ఉండాలి.

**ముద్రించిన ప్రతులను అధికారులకు సమర్పించాలి**

ముద్రణ పూర్తయిన మూడు రోజుల్లోగా ముద్రించిన ప్రచార సామగ్రికి సంబంధించిన నాలుగు ప్రతులు, ప్రచురణకర్త ప్రకటన, ముద్రించిన ప్రతుల సంఖ్య, వసూలు చేసిన ధర వివరాలను సంబంధిత అధికారికి సమర్పించాలి. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ముద్రిత ప్రకటనల విషయంలో వర్తించే ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అనుసరించాలి.

**నిబంధనల ఉల్లంఘనపై చట్టపరమైన చర్యలు**

కులం, మతం, జాతి, వర్గం, భాష ఆధారంగా ఓటర్లను ప్రభావితం చేసేలా లేదా వ్యక్తుల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్న అభ్యంతరకర ప్రచార సామగ్రి విషయంలో వర్తించే ఎన్నికల నియమాలను పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రచార సామగ్రి ముద్రణలో నిబంధనలను ఉల్లంఘించిన వారిపై వర్తించే చట్టాలు, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంబంధిత చట్టంలోని నిబంధనలు వర్తించే సందర్భాల్లో ఆరు నెలల వరకు జైలు శిక్ష లేదా రూ. 2,000 వరకు జరిమానా లేదా రెండూ



విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇతర చర్యలు కూడా సంబంధిత చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా ఉంటాయని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ఎన్నికల ప్రచార సామగ్రి ముద్రణకు సంబంధించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించి, ఎన్నికల నిర్వహణలో పారదర్శకతకు సహకరించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కీర్తి చేకూరి సూచించారు.

# ఎన్నికల భద్రతపై ఎస్పీ తనిఖీలు..

**పిఠాపురం, (మనసులో మాట) అక్టోబరు 16:**

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పిఠాపురంలో భద్రతా ఏర్పాట్లను కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ శుక్రవారం సమీక్షించారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాల్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం రథాలపేట, ఇందిరానగర్, అగ్రహారం ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి నిఘా చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. ఓటర్లు ఇబ్బంది పడకుండా క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఎస్పీ ఆదేశించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా పటిష్ట భద్రత కల్పిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఎస్పీతోపాటు ఈ పర్యటనలో సర్కిల్ ఇన్స్పెక్టర్ జీవివి సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ ఎస్ టి వి రాజేశ్వరరావు, సబ్ ఇన్స్పెక్టర్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు




## రూ.4.5 కోట్ల కొత్త కరెన్సీ నోట్లతో

# వాసవి అమ్మవారికి అలంకరణ

- **కన్యకాపరమేశ్వరి అమ్మవారు..కనువిందు చేస్తున్న కరెన్సీ నోట్లు**

**అమలాపురం (మనసులోమాట) అక్టోబర్ 16 :**

దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమలాపురం మెయిన్‌రోడ్డులో గల శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారిని రూ.4కోట్ల 50లక్షల కొత్త కరెన్సీ నోట్లతో అలంకరించారు.శుక్రవారం శ్రీ మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు ఆమె దర్శనమిచ్చారు. అమ్మవారి ముఖమండపం, అంతరాలయం, గర్భాలయాలను సుమారు రూ.4.5 కోట్ల విలువైన కొత్త కరెన్సీ నోట్లతో అలంకరించడం తో భక్తులు అధిక సంఖ్య లో అమ్మవారిని దర్శించు కున్నారు. కొత్త కరెన్సీ నోట్లతో రూపొందించిన ప్రత్యేక అలంకరణతో ఆలయ ప్రాంగణం వైభవోపేతంగా మారింది.



శ్రీ మహాలక్ష్మి రూపంలో కొలువుదీరిన అమ్మవారి దివ్యదర్శనం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. భక్తి, వైభవం మేళవించిన ఈ అలంకరణ దేవీ నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# వైభవంగా దుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలు

- **సరస్వతి దేవి రూపంలో భక్తులకు దర్శనం**
- **దుర్గమ్మను దర్శించుకున్న మాజీ వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు**
- **అరకు పార్లమెంట్ కార్యదర్శి పెనుబల్లి సాయిబాబు**

**ఎటపాక( మనసులో మాట) అక్టోబర్16:**

పోలవరం జిల్లా ఎటపాక మండలంలోని గ్రామ గ్రామాన దుర్గాదేవి శరన్నవరాత్రులని భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. శరన్నవరాత్రులలో భాగంగా దుర్గాదేవి అమ్మవారు ఆరవ రోజు భక్తులకు సరస్వతి దేవి అవతారంలో దర్శనం ఇచ్చింది. ఈ సందర్భంగా శుక్రవారం నందిగామ గ్రామం లో ఎటపాక మాజీ వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, అరకు పార్లమెంట్ కార్యదర్శి పెనుబల్లి సాయిబాబు సరస్వతి దేవి అవతారంలో ఉన్న అమ్మవారి దర్శించుకునే ప్రత్యేక పూజలు చేశారు. వీరిని కమిటీ సాదరంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుర్గదేవి శరణవరాత్రులలో భాగంగా సరస్వతి దేవి రూపంలో ఉన్న అమ్మవారిని దర్శనం చేసుకోవడం చాలా సంతోషం గా ఉంది అని అన్నారు. అలాగే దుర్గమ్మ తల్లి దయతో ప్రజలందరిని చల్లగా చూడాలని, వర్షాలు బాగా పడి రైతులకు పంటలు పండేలా అమ్మవారు దివిచాలని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమం లో ఆలయా కమిటి భవానిలు వీరేంద్ర, శివాజీ, స్రవంతి,పాల్గొన్నారు.







## వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన నల్లమిల్లి శ్రీనాథ్ రెడ్డి...

- **24వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా నల్లమిల్లి రామలక్ష్మి**

**మండపేట (మనసులో మాట) అక్టోబర్ 16**

మండపేట మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పరిణామాలు ఊపందుకుంటున్నాయి. ఈ క్రమంలో 24వ వార్డుకు చెందిన టిడిపి నాయకుడు నల్లమిల్లి శ్రీనాథ్ రెడ్డి మండపేట వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మండపేట విజయ లక్ష్మీ నగర్ లోని వైసిపి కార్యాలయంలో ఆయనకు వైసిపి పార్టీ కండువా కప్పి తోట త్రిమూర్తులు సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నల్లమిల్లి శ్రీనాథ్ రెడ్డి సతీమణి నల్లమిల్లి రామలక్ష్మిని 24వ వార్డు(టిడ్కో ఏరియా) కౌన్సిలర్ అభ్యర్థిగా ప్రకటించారు.రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా వార్డులోని నాయకులందరూ విభేదాలకు తావులేకుండా కలిసికట్టుగా పనిచేస్తామని స్పష్టం చేశారు. వార్డు ప్రజల సహకారంతో రామలక్ష్మి విజయానికి సమష్టిగా కృషి చేస్తామని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మేక శ్రీను, యాదగని చంటి, గునిపే భూషణం, కోణాల బోస్, బత్తిన దొరబాబు, సింగర్ రాజు, పెనుబోతుల సత్తిబాబు తదితర నాయకులు పాల్గొన్నారు.





## వడ్డీగూడెం రేవులో గుర్తుతెలియని మృతదేహం

- **ఆచూకీ తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలి**

**వి.ఆర్.పురం,(మనసులోమాట) అక్టోబర్ 16;**

పోలవరం జిల్లా వి.ఆర్.పురం మండలంలోని వడ్డీగూడెం గ్రామ సమీప గోదావరి రేవు వద్ద శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. గోదావరిలో కొట్టుకొచ్చిన మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న వి.ఆర్.పురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వివరాలు, ఆచూకీకి సంబంధించిన సమాచారం కోసం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని గుర్తించేందుకు పరిసర ప్రాంతాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటనపై వి.ఆర్.పురం ఎస్ఐ సాదిక్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. వడ్డీగూడెం రేవు వద్ద గోదావరిలో కొట్టుకొచ్చిన మృతదేహం ఎవరిదో తెలిసిన వారు, లేదా తమ గ్రామ పరిధిలో ఎవరైనా వ్యక్తి ఇటీవల కనిపించకుండా పోయినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఫోటోలోని వ్యక్తిని పరిశీలించి తమకు తెలిసిన సమాచారం ఏదైనా ఉంటే వెంటనే వి.ఆర్.పురం పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు. మృతదేహం గుర్తింపు కోసం పోలీసులు అన్ని కోణాల్లో వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.



# టిడిపి పార్టీలోకి చేరిక



- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపుతో రాష్ట్రంలో ట్రిపుల్ ఇంజన్ సర్కార్ రాబోతోంది
- ఎమ్మెల్యే బండారు

కొత్తపేట (మనసులో మాట) అక్టోబర్ 16

కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం, గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలు స్వాగతిస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. వాడపల్లి మాజీ ఎంపీటీసీ ఏపుగంటి వీరరాఘవుల తో సహా 50 కుటుంబాలు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సమక్షంలో శుక్రవారం వైసీపీ పార్టీని వీడి తెలుగుదేశంలో చేరారు. పసుపు కండువాలు కప్పి ఎమ్మెల్యే సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగిన వెంటనే కోనసీమ తిరుమల వాడపల్లిలో వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో ఇంతమంది చేరడం స్వామివారి ఆశీస్సులు కూటమి ప్రభుత్వానికి ఉన్నాయనడానికి నిదర్శనం అన్నారు. తొలిసారిగా శాసనసభ్యునిగా పోటీ చేసినప్పటి నుంచి ఏ ఎన్నిక జరిగిన మొదట వాడపల్లి వచ్చి స్వామి వారిని దర్శించుకుని ప్రచారం మొదలుపెట్టడం తనకు ఆనవాయితీ అని గుర్తుచేసుకున్నారు.

వాడపల్లి మాజీ ఎంపీటీసీ వీరరాఘవులు వారి సహచర బృందం తెలుగుదేశంలో చేరడం చాలా సంతోషకరమన్నారు.ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల ఆధ్వర్యం లో రాష్ట్రంలో డబల్ ఇంజన్ సర్కార్ నడుస్తుందన్నారు. మరలా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులే విజయం సాధించడం ద్వారా ట్రిబుల్ ఇంజన్ సర్కార్ నడవాలని పట్టణాలను, గ్రామాలను మరింతగా అభివృద్ధి చేసుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కేంద్రం, రాష్ట్రం, స్థానిక సంస్థలు మూడు ఇంజన్లుగా ఒకే మాట మీద ఒకే బాటలో పయనించినప్పుడు మరింత అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రజలకు సేవ చేయడానికి, ప్రజలకు సంక్షేమం అందించడానికి గ్రామాలను అభివృద్ధి చేయడానికి కూటమి అభ్యర్థులే గెలవాలని, అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ప్రజలే కోరుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీలు, వార్డు సభ్యులతో సహా అన్నింటా కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. 2029 లో సైతం ఎన్డీఏ కూటమే అధికారంలోకి తిరిగి రాబోతుంద న్నారు. అందరూ కలిసి పనిచేసి ఎన్డీఏ కూటమి తరఫున ఎవరికి అవకాశం ఇచ్చినా, ఎవరు పోటీ చేస్తున్నా అందరినీ గెలిపించుకోవాలని కూటమి నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, వాడపల్లి ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిస్ట్రిబూటర్ కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, వాడపల్లి ఆలయ మాజీ చైర్మన్ తోటకూర సుబ్బరాజు,లొల్ల మాజీ సర్పంచ్ కాయల జగన్నాథం, అభిమానులు కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## వాడపల్లి నిత్యాన్నదాన పథకానికి రూ,4 లక్షల35, వేలు విరాళం

కొత్తపేట (మనసులో మాట) అక్టోబర్ 16

కోనసీమ తిరుమల గా పేరు గాంచిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే నిత్య అన్నదాన పథకానికి ,పెరవలి మండలం , అజ్జరం, గ్రామానికి చెందిన అర్థమూరి నాగ వెంకట కృష్ణరెడ్డి, మయాన్క్ రెడ్డి, కుటుంబ సభ్యులు నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి విరాళంగా రూ,, 4,35,500 చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు లకు అందజేశారు. ఆలయ సూపరిండెంట్ రాంబాబు దాతలకు ప్రత్యేక దర్శనం, వేదాశ్వీరవచనం, తీర్థప్రసాదాలు స్వామి చిత్రపటాన్ని అందజేశారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యం
## అమలాపురంలో కూటమి నాయకుల సమీక్షా సమావేశం

అమలాపురం మనసులోమాట అక్టోబరు16:

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపధ్యంలో అమలాపురం లో మెట్ల రమణబాబు స్వగృహం వద్ద శుక్రవారం కూటమి నాయకుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణ అభివృద్ధి, ఎన్నికల వ్యూహాలు, వార్డుల వారీగా కూటమి పార్టీల బలనిరూపణపై సుదీర్ఘంగా చర్చించారు. అమలాపురం పట్టణ పరిధిలోని మొత్తం 36 వార్డుల్లో నూ కూటమి అభ్యర్థులను విజయమే లక్ష్యంగా పనిచేయాలని నాయకులు తీర్మానించారు. ఈ సందర్భంగా కూటమి ముఖ్య నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అమలాపురం పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని 36 వార్డుల్లో కూటమి శ్రేణులు పూర్తి సమన్వయంతో, క్రమశిక్షణతో పనిచేసి చారిత్రాత్మక విజయాన్ని సాధించాలని కోరారు. వార్డు స్థాయి నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు,గిడ్డి సత్యనారాయణ తోపాటు కూటమి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.





## స్థానిక సమస్యలతో సతమతమవుతున్న ఏలేశ్వరం ప్రజలు

ఏలేశ్వరం (మనసులో మాట) అక్టోబర్ 16

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం, ఏలేశ్వరం మున్సిపాలిటీ లో నెలకొన్న సమస్యల పై స్థానికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ మున్సిపాలిటీ పరిధిలోని గుళ్లమెట్ట కరెంట్ ఆఫీస్ పక్కన ఉన్న రామకూట ప్రాంతంలో పలు మౌలిక వసతుల లేకుండా అనేక సమస్యలతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు వెల్లడించారు. ఈ ప్రాంతంలో చెత్త పేరుకుపోతున్నప్పటికీ, దానిని ఎవరూ క్లీన్ చేయడం లేదని, ఎక్కడైనా ఖాళీ స్థలంలో చెత్త పేరుకుపోతేనే వచ్చి తొలగిస్తున్నారని ఆరోపించారు. మురుగు నీరు నిలిచిపోవడంతో పాటు, పాత వార్డు నెంబర్ చెప్పినా ఎవరూ పట్టించు కోవడం లేదని వారు వాపోయారు. కేవలం ఎన్నికల సమయంలోనే అందరూ వస్తారని వాపోయారు.రాత్రి సమయంలో డ్రైనేజీల ద్వారా తీవ్రమైన దోమల బెడదతో పాటు అనేక రకాల అనారోగ్య సమస్యలు, తీవ్ర నీరసానికి గురవుతున్నామని స్థానికులు తెలిపారు. వీధి లైట్లు వెలగడం లేదని ఎన్నిసార్లు సచివాలయానికి, మున్సిపల్ ఆఫీసుకు వెళ్లి ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించు కోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.అధికారులు ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయం తో సంబంధం లేకుండా ఎప్పుడూ అందుబాటులో లేకపోయినా, ఈ సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.



## ఏలూరు మున్సిపల్ ఎన్నికలు.. నామినేషన్ల కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు

ఏలూరు, అక్టోబర్ 16 (మనసులో మాట)

ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నేపథ్యంలో నగరంలో పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. నామినేషన్ల దాఖలు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఏలూరు డీఎస్పీ డి. శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో ఏలూరు వన్ టౌన్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభ్యర్థులు, సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. కార్యాలయం వద్ద రద్దీని నియంత్రించడం తో పాటు, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక బారికేడ్లను ఏర్పాటు చేశారు.ఏలూరు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ కె. రామకృష్ణ, ఎస్సైలు సుధాకర్, రామకృష్ణ పోలీసు సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్ల కేంద్రం వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించేలా చర్యలు తీసుకుంటున్నారు. ట్రాఫిక్ మళ్లింపులు, రద్దీ నియంత్రణ, భద్రతా పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పోలీసులకు సహకరించాలని ప్రజలకు సూచించారు.





# స్థానిక సంస్థల ఎన్నికల్లో వ్యయ పరిమితి తప్పనిసరిగా పాటించాలి

- **ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు**
- **ఓటర్లకు నగదు మద్యం బహుమతుల పంపిణీ నిషేధం**
- **అభ్యర్థులు రోజువారీ ఎన్నికల ఖర్చుల వివరాలు నమోదు చేయాలి**
- **జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కీర్తి చేకూరి**

**రాజమహేంద్రవరం (మనసులో మాట) అక్టోబర్ 16**

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) నిర్దేశించిన ఎన్నికల వ్యయ పరిమితులను తప్పనిసరిగా పాటించాలని తూర్పు గోదావరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు.ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా పారదర్శకంగా జరిగేలా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

**ఎన్నికలు జరిగే ప్రాంతాలు**

తూర్పు గోదావరి జిల్లాలోని కొవ్వూరు, నిడదవోలు, మండపేట పట్టణ స్థానిక సంస్థల పరిధితో పాటు మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (జెడ్పీటీసీ), గ్రామ పంచాయతీల సర్పంచ్, గ్రామ వార్డు సభ్యుల స్థానాలకు జరిగే ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించాలి.

**అభ్యర్థుల ఎన్నికల వ్యయ పరిమితులు**

గ్రామ పంచాయతీల్లో 10 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థి గరిష్ఠంగా రూ.4 లక్షలు, వార్డు సభ్యుడు రూ.1 లక్ష వరకు; 10 వేలలోపు జనాభా ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థి రూ.2.50 లక్షలు, వార్డు సభ్యుడు రూ.60 వేల వరకు ఖర్చు చేయవచ్చని అందించిన వివరాల్లో పేర్కొన్నారు.ఎంపీటీసీ అభ్యర్థికి రూ.4 లక్షలు, జెడ్పీటీసీ అభ్యర్థికి రూ.8 లక్షల పరిమితి సూచించారు. పట్టణ స్థానిక సంస్థల్లో చైర్పర్సన్, కౌన్సిలర్ అభ్యర్థులకు వర్తించే పరిమితులు సంబంధిత మున్సిపాలిటీ వర్గీకరణ, వార్డు స్థాయి, రాష్ట్ర ఎన్నికల సంఘం తాజా ఉత్తర్వుల ప్రకారం వర్తిస్తాయి. అభ్యర్థులు తమ స్థానానికి వర్తించే అధికారిక పరిమితిని సంబంధిత ఎన్నికల అధికారుల నుంచి నిర్ధారించుకోవాలి.

**రోజువారీ ఖర్చుల వివరాల నమోదు**

ప్రతి పోటీ చేసే అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసిన తేదీ నుంచి ఫలితాలు ప్రకటించే తేదీ వరకు ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ఖర్చులను నిర్దేశిత రిజిస్టర్లో రోజువారీగా నమోదు చేయాలి. ప్రచార సామగ్రి, కరపత్రాలు, బ్యానర్లు, వాహనాలు, సభలు, సమావేశాలు, ఇతర ప్రచార కార్యకలాపాలకు సంబంధించిన ఖర్చుల వివరాలు, బిల్లులు, రశీదులు భద్రపరచాలి. ఎన్నికల వ్యయ ఖాతాను సంబంధిత ఎన్నికల అధికారి సూచించిన విధానంలో, గడువులోగా సమర్పించాలి. పంచాయతీరాజ్ ఎన్నికలకు వర్తించే నిబంధనల ప్రకారం ఫలితాల ప్రకటన నుంచి 45 రోజుల్లోగా వ్యయ ఖాతా సమర్పించాల్సి ఉంటుంది.

**ఓటర్లకు ప్రలోభాలు చూపరాదు**

ఓటర్లను ప్రభావితం చేసేందుకు నగదు, మద్యం, బహుమతులు, వస్తువులు లేదా ఇతర ప్రలోభాలు పంపిణీ చేయడం నిషేధం. ఓటు వేయడానికి లేదా వేయకుండా ఉండేందుకు డబ్బు, వస్తువులు ఇవ్వడం లేదా తీసుకోవడం చట్టపరమైన పరిణామాలకు దారితీస్తుంది. ఎన్నికల నిఘా బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్లు అనుమానాస్పద నగదు, మద్యం, ఇతర వస్తువుల రవాణా, పంపిణీపై తనిఖీలు నిర్వహిస్తాయి. ప్రజలు ఇటువంటి అక్రమాలపై సంబంధిత ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు.

**ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయరాదు**

ప్రభుత్వ వాహనాలు, కార్యాలయాలు, అతిథి గృహాలు, ప్రభుత్వ సిబ్బంది లేదా ప్రజాధనంతో నిర్వహించే వనరులను పార్టీ ప్రచారం కోసం ఉపయోగించ కూడదు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న ప్రాంతాల్లో కొత్త పథకాల ప్రకటనలు, ఓటర్లను ప్రభావితం చేసే ప్రత్యేక ప్రయోజనాల పంపిణీ, నిషేధిత శంకుస్థాపనలు, అభివృద్ధి ప నుల ప్రకటనలు చేయరాదు. ఈ విషయంలో సంబంధిత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, అమలులో ఉన్న మినహాయింపులను పాటించాలి.



**ప్రచారానికి ముందస్తు అనుమతులు తప్పనిసరి**

ఎన్నికల ప్రచార సభలు, ర్యాలీలు, ఊరేగింపులు, లౌడ్‌స్పీకర్ల వినియోగానికి సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలి. లౌడ్‌స్పీకర్ల వినియోగంలో రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు నిషేధానికి సంబంధించిన నిబంధనలను పాటించాలి. ప్రైవేటు ఇళ్లు, ప్రహరీలు, భవనాలపై యజమాని అనుమతి లేకుండా పోస్టర్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయరాదు. ప్రభుత్వ, ప్రజా ఆస్తులపై ప్రచార సామగ్రి ఏర్పాటు విషయంలో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరించాలి.

**కుల, మత విద్వేషాలకు తావివ్వరాదు**

కులం, మతం, భాష ఆధారంగా ఓట్లు కోరడం, వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం నిషేధం. దేవాలయాలు, మసీదులు, చర్చిలు వంటి ప్రార్థనా స్థలాలను ఎన్నికల ప్రచార వేదికలుగా ఉపయోగించరాదు. ప్రత్యర్థులపై వ్యక్తిగత దూషణలు, నిరాధార ఆరోపణలు చేయకుండా ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా ప్రచారం నిర్వహించాలి.

**నిబంధనలు పాటించాలి**

అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల సంఘం సూచనలను పూర్తిగా పాటించి స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కీర్తి చేకూరి కోరారు.

# మొదటి రోజు మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పూర్తి

- **జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్**

**అమలాపురం (మనసులోమాట) అక్టోబరు16:**

రెండవ సాధారణ ఎన్నికలు-2026లో భాగంగా జిల్లాలోని పురపాలక సంఘాల ఎన్నికలకు సంబంధించి మొదటి రోజు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పూర్తయిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. జిల్లాలోని అమలాపురం, రామచంద్రపురం, ముమ్మిడివరం పురపాలక సంఘాల పరిధిలో చైర్పర్సన్, వార్డు సభ్యుల పదవులకు సంబంధించి శుక్రవారం నామినేషన్ల స్వీకరణ చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

**అమలాపురం పురపాలక సంఘం:**

అమలాపురం పురపాలక సంఘంలో చైర్పర్సన్ పదవికి మొదటి రోజు ఎలాంటి నామినేషన్ పత్రాలు స్వీకరించలేదని కలెక్టర్ తెలిపారు. మొత్తం 36 వార్డులకు గాను 12వ వార్డులో వైఎస్సార్సీపీ అభ్యర్థికి సంబంధించి ఒక నామినేషన్ పత్రం స్వీకరించినట్లు పేర్కొన్నారు. మిగిలిన 35 వార్డులకు సంబంధించి మొదటి రోజు నామినేషన్లు స్వీకరించలేదని వివరించారు.



**రామచంద్రపురం పురపాలక సంఘం:**

రామచంద్రపురం పురపాలక సంఘం లో చైర్పర్సన్ పదవికి మొదటి రోజు ఎలాంటి నామినేషన్ పత్రాలు స్వీకరించలేదని కలెక్టర్ తెలిపారు. మొత్తం 32 వార్డులకు గాను 6వ, 20వ వార్డులకు సంబంధించి వైఎస్సార్సీపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలు స్వీకరించినట్లు పేర్కొన్నారు. మిగిలిన 30 వార్డులకు సంబంధించి మొదటి రోజు నామినేషన్లు స్వీకరించలేదని తెలిపారు.

**ముమ్మిడివరం పురపాలక సంఘం:**

ముమ్మిడివరం పురపాలక సంఘంలో చైర్పర్సన్ పదవికి మొదటి రోజు ఎలాంటి నామినేషన్ పత్రాలు స్వీకరించలేదని కలెక్టర్ వెల్లడించారు. మొత్తం 23 వార్డులకు సంబంధించి కూడా మొదటి రోజు ఎలాంటి నామినేషన్ పత్రాలు స్వీకరించలేదని తెలిపారు. పురపాలక సంఘాల ఎన్నికల ప్రక్రియను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు.

# అమలాపురంలో స్థానిక సంస్థల ఎన్నికలపై సమన్వయ సమావేశం

- **పట్టణ టిడిపి నాయకులకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఎంపీ సానా సతీష్**

**అమలాపురం( మనసులోమాట) అక్టోబరు16**

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అమలాపురం పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం పట్టణ టిడిపి ముఖ్య నాయకుల సమన్వయ సమావేశం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించబడింది. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు సానా సతీష్ అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు స్థానిక టిడిపి ముఖ్య నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని గ్రామాలు, మండలాల వారీగా ఉన్న ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై నాయకులు సమగ్ర సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన కార్యాచరణ, ఎలక్షన్ వ్యూహాలు మరియు కూటమి శ్రేణుల సమన్వయంపై నాయకులకు విస్తృతంగా దిశానిర్దేశం చేశారు. అలాగే పట్టణ టిడిపి నాయకులతో కూడా ప్రత్యేకంగా



సమావేశం నిర్వహించి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించడానికి అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రణాళికలపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజా బాహుళ్యంలోకి బలంగా తీసుకెళ్లి, ఎన్నికల్లో విజయావకాశాలను సుగమం చేసుకోవడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు చెరుకూరి సాయి రామ్ పెచ్చేటి విజయలక్ష్మి జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు నియోజకవర్గ పరిశీలకులు వనమాడి సునీత అధికారి జయవెంకటలక్ష్మి, తిక్కిరెడ్డి నేతాజీ, కర్రి రామస్వామి, చిక్కాల గణేష్, బొర్రా ఈశ్వరరావు, మాకిరెడ్డి పూర్ణిమ తదితర ముఖ్య నాయకులు కార్యకర్తలు సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్నికల సంఘం ప్రకటించిన నిబంధనలు నియమావళి తూచా పాటించాలి

- రాజమండ్రి సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్

**రాజమహేంద్రవరం (మనసులో మాట) అక్టోబర్ 16**



ఎన్నికల నిర్వహణపై అధికారులతో సబ్ కలెక్టర్ సమీక్ష సమావేశం. రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలపై సబ్ కలెక్టర్ శుభం నోఖ్వాల్ శుక్రవారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శుభం నోక్వాల్ ఎన్నికలకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలు, అధికారుల బాధ్యతలు, క్షేత్రస్థాయిలో సమన్వయంతో విధుల నిర్వహణ తదితర అంశాలపై సూచనలు చేయడం జరిగింది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలు, అధికారుల బాధ్యతలు, విధుల నిర్వహణ, పరస్పర సమన్వయంపై చర్చించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సబ్ కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డివిజనల్ అభివృద్ధి అధికారి పి వీణాదేవి, డివిజనల్ పంచాయతీ అధికారి ఎం నాగలత , తహశీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారులు , ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులు వ్యయ పరిమితులు పాటించాలి
- ప్రచార ఖర్చుల వివరాలు రోజువారీగా నమోదు చేయాలి

**అమలాపురం( మనసులోమాట) అక్టోబరు16**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) నిర్దేశించిన ఎన్నికల వ్యయ పరిమితులను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించే చర్యలకు పాల్పడరాదని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.

**జిల్లాలో ఎన్నికలు జరిగే స్థానాలు:**
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (జెడ్పీటీసీ), గ్రామ పంచాయతీల సర్పంచ్, గ్రామ వార్డు సభ్యుల స్థానాలకు జరిగే ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పని సరిగా అనుసరించాలి.

**ఎన్నికల వ్యయ పరిమితులు**
10 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థి గరిష్ఠంగా రూ.4 లక్షలు, వార్డు సభ్యుడు రూ.1 లక్ష వరకు ఖర్చు చేయవచ్చు. 10 వేలలోపు జనాభా ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థికి రూ.2.50 లక్షలు, వార్డు సభ్యుడికి రూ.60 వేల వరకు పరిమితి సూచించారు. ఎంపీటీసీ అభ్యర్థికి రూ.4 లక్షలు, జెడ్పీటీసీ అభ్యర్థికి రూ.8 లక్షల పరిమితి పేర్కొన్నారు. అయితే అభ్యర్థులు పోటీ చేసే స్థానానికి వర్తించే తుది వ్యయ పరిమితిని రాష్ట్ర ఎన్నికల సంఘం తాజా ఉత్తర్వులు, సంబంధిత ఎన్నికల అధికారుల సూచనల మేరకు నిర్ధారించుకోవాలి.

**ప్రచార ఖర్చుల లెక్కలు నిర్వహించాలి:**
నామినేషన్ దాఖలు చేసిన తేదీ నుంచి ఫలితాలు ప్రకటించే తేదీ వరకు ఎన్నికల ప్రచారానికి చేసిన ప్రతి ఖర్చును అభ్యర్థులు నిర్దేశిత రిజిస్టర్‌లో రోజువారీగా నమోదు చేయాలి. ప్రచార వాహనాలు, కరపత్రాలు, బ్యానర్లు, సభలు, సమావేశాలు, ఇతర ప్రచార సామగ్రికి సంబంధించిన ఖర్చుల వివరాలు, బిల్లులు, రశీదులు భద్రపరచాలి. ఎన్నికల వ్యయ ఖాతాలను



సంబంధిత ఎన్నికల అధికారి సూచించిన విధానంలో, నిర్దేశిత గడువులోగా సమర్పించాలి. పంచాయతీరాజ్ ఎన్నికలకు వర్తించే నిబంధనల ప్రకారం ఫలితాల ప్రకటన నుంచి 45 రోజుల్లోగా వ్యయ ఖాతాను సమర్పించాల్సి ఉంటుంది.

**నగదు, మద్యం, బహుమతుల పంపిణీ నిషేధం**
ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు నగదు, మద్యం, బహుమతులు, నిత్యావసర వస్తువులు లేదా ఇతర ప్రయోజనాలను పంపిణీ చేయరాదు. ఓటు వేయడానికి ప్రతిఫలంగా డబ్బు లేదా వస్తువులు ఇవ్వడం, తీసుకోవడం చట్టవిరుద్ధం. ఎన్నికల అక్రమాలను అరికట్టేందుకు నిఘా బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్లు తనిఖీలు నిర్వహిస్తాయి. ఇలాంటి ఘటనలు గుర్తించినప్పుడు సంబంధిత ఎన్నికల అధికారులకు సమాచారం అందించాలి.

**ప్రభుత్వ వనరులను ప్రచారానికి ఉపయోగించరాదు**
ప్రభుత్వ వాహనాలు, కార్యాలయాలు, అతిథి గృహాలు, ప్రభుత్వ సిబ్బంది లేదా ప్రజాధనంతో నిర్వహించే వనరులను ఎన్నికల ప్రచారానికి ఉపయోగించడం నిషేధం. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న ప్రాంతాల్లో కొత్త పథకాల ప్రకటనలు, ఓటర్లను ప్రభావితం చేసే ప్రయోజనాల పంపిణీ, నిషేధిత శంకుస్థాపనలు, అభివృద్ధి పనుల ప్రకటనల విషయంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలి.సభలు, ర్యాలీలకు అనుమతులు అవసరం: ఎన్నికల ప్రచార సభలు, ర్యాలీలు, ఊరేగింపులు, లౌడ్‌స్పీకర్ల వినియోగానికి సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలి. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్‌స్పీకర్ల వినియోగంపై నిషేధానికి సంబంధించిన నిబంధనలను పాటించాలి. ప్రైవేటు ఇళ్లు, ప్రహరీలు, భవనాలపై యజమాని అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, పోస్టర్లు ఏర్పాటు చేయరాదు.

**ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి**
అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించి, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ కోరారు.

# మండపేటలో జనసేన పార్టీ నూతన కార్యాలయం ప్రారంభం..

**మండపేట (మనసులో మాట) అక్టోబర్ 16**

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండపేట పట్టణంలోని కెపి రోడ్డులో, గౌతమి మున్సిపల్ స్కూల్ సమీపంలో మండపేట నియోజకవర్గ జనసేన పార్టీ నూతన కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యాలయంలో మండపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణ ప్రజలకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో వుంటారు. తనను కలవడానికి వచ్చే పార్టీ శ్రేణులు ఎవరైనా సరే కపిలేశ్వరపురం మండలం వల్లూరు గ్రామంలోని స్వగృహానికి వెళ్ళకుండా, నేరుగామండపేట పార్టీ కార్యాలయానికి రావాలని లీలాకృష్ణ తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, పార్టీ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడానికి ఈ జనసేన పార్టీ కార్యాలయం వేదికగా నిలవనుంది.




# వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

**ఏలూరు, అక్టోబరు 16(మనసులో మాట)**

వసతి గృహాల్లో విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యం, విద్యాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్. శ్రీలక్ష్మి సూచించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తూ, పరిశుభ్రమైన వాతావరణంలో విద్యనభ్యసించేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు.రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు శుక్రవారం ఏలూరు విద్యానగరంలోని శిశుగృహాన్ని, శనివారపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని ఎన్. శ్రీలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో అందుతున్న సదుపాయాలను పరిశీలించి, విద్యార్థులకు కల్పిస్తున్న వసతి, ఆహారం, ఆరోగ్య పరిరక్షణ,



విద్యా ప్రమాణాలకు సంబంధించిన అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. వసతి గృహాల్లో పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, పిల్లల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ఆహార పట్టిక ప్రకారం పోషక విలువలతో కూడిన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, వసతి గృహాల నిర్వహణకు సంబంధించిన రికార్డులను నిబంధనల ప్రకారం పక్కాగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, వారి విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. పిల్లలకు అందుతున్న సౌకర్యాల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.



మనసులో మాట
KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా అస్త్రం.. సంచలన తెలుగు దిన పత్రిక

# లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

**రాజమహేంద్రవరం (మనసులో మాట) అక్టోబర్ 16**



రాజమండ్రి సబ్ కలెక్టర్ కార్యాలయం లో శుక్రవారం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ అధ్యక్షతన సబ్ డిస్ట్రిక్ట్ స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ, సబ్ డిస్ట్రిక్ట్ స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశాలు నిర్వహించారు. గర్భధారణకు పూర్వం, గర్భధారణ సమయంలో లింగ నిర్ధారణను నిషేధించే పీసీపీఎన్‌డీటీ చట్టం 1994, దాని నిబంధనలు 1996 అమలుపై సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ శుభం నోక్వాల్ మాట్లాడుతూ లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న గ్రామాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రజలకు లింగ సమానత్వం, లింగ నిర్ధారణ పరీక్షల నిషేధంపై విస్తృత అవగాహన కల్పించాలని వైద్యాధికారులు, సంబంధిత సిబ్బందికి సూచించారు. గర్భిణీ స్త్రీలతో మాట్లాడి, వారికి చట్టంపై ఉన్న అవగాహన, వైద్య సేవలపై అభిప్రాయాలను తెలుసుకోవాలని, తదుపరి సమావేశానికి హాజరయ్యే సమయంలో వారి అభిప్రాయాలు, స్పందనలతో కూడిన వివరాలను తీసుకురావాలని ఆదేశించారు. స్కానింగ్‌కు ముందు లేదా అనంతరం ఎట్టి పరిస్థితుల్లోనూ పిండం లింగాన్ని వెల్లడించరాదని స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించి లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినా, పిండం లింగాన్ని వెల్లడించినా, అటువంటి చర్యలకు సహకరించినా సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం నేర స్వభావాన్ని బట్టి జైలు శిక్ష, జరిమానాలు విధించే అవకాశం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.వి. చలపతిరావు, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వాసవి, ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ అదిత, డిప్యూటీ డెమో పి. సత్యవతి, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎన్నికల ప్రశాంత నిర్వహణకు పటిష్ట భద్రతా చర్యలు

**నూజివీడు, అక్టోబరు16 (మనసులో మాట)**



ఏలూరు జిల్లాలో రానున్న మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీఎస్, పోలీసు అధికారులను ఆదేశించారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జంగారెడ్డిగూడెం, నూజివీడు సబ్ డివిజన్ల పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ నూజివీడులో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణ, పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు, సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు చర్యలు, అవాంఛనీయ సంఘటనల నివారణ తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ సూచించారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లేందుకు, ఓటు వేసిన అనంతరం బయటకు వచ్చేందుకు అనువైన మార్గాలు ఉండేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో క్రమశిక్షణతో కూడిన వాతావరణాన్ని కొనసాగిస్తూ, ఎన్నికల విధులకు ఆటంకం కలగకుండా చూడాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల నుంచి 200 మీటర్ల పరిధిలో అనధికార జనసమూహాలు గుమిగూడకుండా నిఘా ఉంచాలని, ఎన్నికల నియమ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలు ఎదురుకాకుండా క్షేత్రస్థాయిలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాలు, పార్టీ చిహ్నాల ప్రదర్శన, ర్యాలీల సమయంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు సమాచారాన్ని సేకరించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా జరిగే కార్యకలాపాలను గుర్తించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన కార్యకర్తల మధ్య వివాదాలు తలెత్తకుండా పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు.

గత ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వ్యక్తులు, గొడవల్లో పాల్గొన్నవారు, సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీ ఆదేశించారు. వార్డుల వారీగా



సమస్యాత్మక వ్యక్తుల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వ్యక్తులపై చట్ట ప్రకారం బైండోవర్ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా ముందస్తు సమాచార సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, అనుమానాస్పద పరిణామాలను గుర్తించిన వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే వెంటనే స్పందించేలా పోలీసు సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఎస్పీ సూచించారు. సబ్ డివిజన్ల పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఎన్నికల నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించేలా చూడాలని, ప్రజలకు భద్రతపై భరోసా కల్పించాలని ఎస్పీ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎక్కడా రాజీ పడబోమని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జంగారెడ్డిగూడెం డీఎస్పీ వెంకటేశ్వర్లు, నూజివీడు డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి. ప్రసాద్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఆయా సబ్ డివిజన్ల పరిధిలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# కోరింగా కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో... సాంప్రదాయబద్ధంగా దసరా సంబరాలు

**తాళ్లరేవు (మనసులో మాట) అక్టోబర్ 16:**

కోరింగా కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం దసరా సంబరాలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు నిర్వహించిన ఈ సంబరాలను కళాశాల సెక్రటరీ ప్రగళ్లపాటి కనకరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినిలు సాంప్రదాయ దుస్తులు ధరించి ఆట, పాటలతో ఉత్సాహంగా సంబరాలలో పాల్గొన్నారు. విద్యార్థులు చేసిన దాండియా నృత్యం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకే ప్రతియేటా సంక్రాంతి, దసరా సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు పి.నాగమణి, జి.సీత, ప్రిన్సిపాల్ సువర్ణజ్యోతి, ఏఓ కె.మాల తదితరులు పాల్గొన్నారు.



# ఏలేశ్వరం మున్సిపల్ ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా బదిరెడ్డి ఆశలత గోవింద్

- **అభ్యర్థిత్వం ప్రకటించిన నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు**

**ఏలేశ్వరం (మనసులో మాట) అక్టోబర్ 16**

ఏలేశ్వరం మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా బదిరెడ్డి ఆశలత గోవింద్‌ను వైసీపీ అధిష్టానం ఆదేశాల మేరకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు ప్రకటించారు. స్థానిక రాజకీయాలపై అవగాహన, ప్రజాప్రతినిధిగా పనిచేసిన అనుభవం, కుటుంబానికి ఉన్న రాజకీయ నేపథ్యం ఆశలత అభ్యర్థిత్వానికి బలంగా నిలుస్తున్నాయి.

**ప్రజాసేవలో అనుభవం.. రాజకీయ నేపథ్యం...**

బదిరెడ్డి ఆశలత గతంలో కౌన్సిలర్‌గా, అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా పనిచేసి అనుభవం సంపాదించారు. అలాగే ప్రస్తుతం ఏలేశ్వరం టౌన్ వైసిపి మహిళా అధ్యక్షురాలుగా పనిచేస్తూ ప్రజా సమస్యలపై పట్టు సాధించారు. ప్రజా సమస్యలపై అవగాహనతో పాటు స్థానిక సంస్థల పాలనపై పరిచయం ఉండటం ఆమెకు కలిసివచ్చే అంశాలుగా పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఆశలత భర్త బదిరెడ్డి గోవింద్ అత్త బదిరెడ్డి వెంకటరమణమ్మ గత కౌన్సిల్‌లో కౌన్సిలర్లుగా పనిచేశారు. దీంతో బదిరెడ్డి కుటుంబానికి ఏలేశ్వరం పట్టణ రాజకీయాలతో పాటు స్థానిక ప్రజలతో సుదీర్ఘ అనుబంధం ఉంది. ప్రస్తుతం వైసీపీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శిగా బదిరెడ్డి గోవింద్ పని చేస్తున్నారు.

**గత పాలకవర్గం విజయంలో కీలక పాత్ర పోషించిన బదిరెడ్డి గోవింద్**

గత నగర పంచాయతీ ఎన్నికల్లో పాలకవర్గం విజయానికి బదిరెడ్డి గోవింద్ కీలక పాత్ర పోషించారు. ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందిన ఆయనకు పట్టణంలోని వివిధ వర్గాలతో సత్సంబంధాలు ఉండటం కుటుంబ రాజకీయ బలానికి ప్రధాన అంశంగా నిలుస్తోంది. స్థానిక సమస్యలపై అవగాహన, ప్రజలతో నిరంతర సంబంధాలు, రాజకీయంగా అందుబాటులో ఉండే నాయకుడిగా ఆయనకు ఉన్న గుర్తింపు పార్టీకి అనుకూలంగా మారే అవకాశముంది. ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా తన భార్య అయిన ఆశలతకు అవకాశం వైసీపీ అధిష్టానం ఖరారు చేయడం తో ఏలేశ్వరం పట్టణం లో వై సి పి శ్రేణుల్లో ఆనందం వెల్లువెత్తుతుంది బదిరెడ్డి ఆశలత పేరును ఖరారు చేయడంతో



ఏలేశ్వరం మున్సిపాలిటీ రాజకీయాల్లో బదిరెడ్డి కుటుంబానికి మరోసారి ప్రాధాన్యం లభించినట్లయింది. కౌన్సిలర్‌గా, అన్నవరం ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా ఆమెకు ఉన్న అనుభవం, కుటుంబానికి ఉన్న రాజకీయ పరిచయాలు, పట్టణంలోని వివిధ వర్గాలతో ఉన్న సంబంధాలు ఆమె అభ్యర్థిత్వానికి ప్రధాన బలాలుగా కనిపిస్తున్నాయి. మొత్తంగా, అనుభవం, స్థానిక పరిచయాలు, ప్రజలతో అనుబంధం అనే అంశాలను ఆధారంగా చేసుకుని బదిరెడ్డి ఆశలత గోవింద్‌ను ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా వైసీపీ ముందుకు తీసుకురావడం ఏలేశ్వరం రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది

# దసరా ఉత్సవాల్లో భాగంగా
# ఆదిత్యలో సహపంతి భోజనాలు

**గండేపల్లి ( మనసులో మాట) అక్టోబర్ 16:**



ఆదిత్య యూనివర్సిటీ లో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సహపంక్తి భోజనాలు గండేపల్లి మండలం సూరంపాలెం: ఆదిత్య యూనివర్సిటీ లో ఉన్న శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయం వద్ద శ్రీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. (శుక్రవారం) మూలా నక్షత్రం, సరస్వతి అమ్మవారి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ సమీపంలో గల మామిడి తోటలో ఆదిత్య అధినేతలు డా.నల్లమిల్లి శేషారెడ్డి గారి ఆధ్వర్యంలో క్యాంపస్ నందు గల సిబ్బందికి సహపంక్తి



భోజనాలు ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయ,ఉపాధ్యాయేతర,మరియు ఆఫీస్ సిబ్బంది ఆయాలు , అటెండర్లు తో సహా అందరూ ఈ సహపంక్తి భోజనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది చే ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. రేపటి నుంచి దసరా సెలవులు కావున సిబ్బంది అందరూ ఎంతో ఉత్సాహంగా గడపగా డా. శేషారెడ్డి ఆప్యాయంగా అందరినీ పేరుపేరునాపలకరిస్తూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం తో సిబ్బంది ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఈ సందర్భంగా డా. శేషారెడ్డి మాట్లాడుతూ మన సంస్కృతిలో సహపంక్తి భోజనం సంప్రదాయానికి చక్కటి స్థానం ఉందని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమాలు ఎంతో ఉత్సాహంగా నిర్వహించిన వ్యాఖ్యాతలను ప్రత్యేకంగా అభినందించిన ఆయన అందరికీ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ది .18102026 (ఆదివారం) దుర్గాష్టమి / దుర్గా హోమం. 20102026 విజయదశమి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, శమీ పూజ. *శ్రీ షిర్డీ సాయిబాబా వారి మహా సమాది చెందిన రోజు పురస్కరించుకుని బాబా గారికి పంచామృత అభిషేకం, విశేష పూజలు.ప్రతీ రోజు ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు





విశేష పూజలు సాయంత్రం 5 గంటల నుండి 8 గంటల వరకు కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ లో గల అందరు అధికారులు వివిధ విభాగాల అధిపతులు ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

# వైసీపీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా తోట పృథ్వీరాజ్?

- **యువ నాయకుడిని రంగంలోకి దింపే యోచన...**
- **కూటమి అభ్యర్థి వేగుళ్ల అజయ్ బాబుకు పోటీగా వైసీపీ వ్యూహం?**
- **అభ్యర్థి ఎంపికపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ...**

**మండపేట (మనసులో మాట) అక్టోబర్ 16**

మండపేట మున్సిపల్ చైర్మన్ పదవికి సంబంధించిన రాజకీయ పరిణామాలు రోజురోజుకూ ఆసక్తికరంగా మారుతున్నాయి. మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని దక్కించుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్న నేపథ్యంలో, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎవరు బరిలోకి దిగబోతున్నారన్న అంశం పట్టణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కూటమి తరఫున వేగుళ్ల అజయ్ బాబు పేరు తెరపైకి రావడంతో, వైసీపీ కూడా యువ నాయకుడిని అభ్యర్థిగా నిలిపే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది....

**తోట పృథ్వీరాజ్ పేరు తెరపైకి...**

మండపేట నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు తోట పృథ్వీరాజ్‌ను మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా రంగంలోకి దింపే అవకాశాలున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. యువ నాయకత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచనతో ఆయన పేరును పరిశీలిస్తున్నట్లు పార్టీ వర్గాల ద్వారా సమాచారం వినిపిస్తోంది. అయితే, ఈ విషయంపై వైసీపీ అధిష్ఠానం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

**యువ నాయకుల మధ్య పోటీ ఉంటుందా?**

కూటమి తరఫున వేగుళ్ల అజయ్ బాబు పేరు చర్చకు రావడం, మరోవైపు వైసీపీ నుంచి తోట పృథ్వీరాజ్ పేరు ప్రచారంలోకి రావడంతో మండపేట మున్సిపల్ చైర్మన్ ఎన్నికపై ప్రజల్లోనూ, రాజకీయ వర్గాల్లోనూ ఆసక్తి పెరుగుతోంది. రెండు ప్రధాన రాజకీయ పక్షాలు యువ నాయకత్వానికి ప్రాధాన్యం ఇస్తాయా? అభ్యర్థుల ఎంపికలో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటాయి? అన్న అంశాలపై చర్చ సాగుతోంది.మున్సిపల్ చైర్మన్ పదవి కేవలం ఒక రాజకీయ హోదా మాత్రమే కాకుండా, పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రహదారులు, వీధి దీపాలు వంటి స్థానిక సమస్యల పరిష్కారానికి కీలకమైన బాధ్యతగా ఉంటుంది. ఈ నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికతో పాటు, భవిష్యత్తులో పట్టణ అభివృద్ధికి వారు ఎలాంటి



ప్రాధాన్యం ఇస్తారన్న అంశం ప్రాధాన్యత సంతరించుకుంటోంది.అధికారిక ప్రకటన కోసం ఎదురుచూపులు మండపేట మున్సిపల్ చైర్మన్ అభ్యర్థుల విషయంలో ప్రస్తుతం వినిపిస్తున్న పేర్లపై అధికారిక ప్రకటనలు వెలువడాల్సి ఉంది. ముఖ్యంగా వైసీపీ తరఫున తోట పృథ్వీరాజ్ అభ్యర్థిత్వం ఖరారవుతుందా? లేక పార్టీ మరో నాయకుడికి అవకాశం కల్పిస్తుందా? అన్నది వేచి చూడాల్సి ఉంది. అభ్యర్థుల ఎంపిక పూర్తయిన తర్వాతే ఎన్నికల బరిలో నిలిచే నాయకులపై స్పష్టత రానుంది. మొత్తానికి, మండపేట మున్సిపల్ చైర్మన్ పదవిని కేంద్రంగా చేసుకుని రాజకీయ చర్చలు వేడెక్కుతున్నాయి. కూటమి, వైసీపీ తమ అభ్యర్థులను అధికారికంగా ప్రకటించిన తర్వాత పట్టణ రాజకీయాల్లో మరిన్ని పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం తోట పృథ్వీరాజ్ పేరు ప్రచారంలో ఉండటంతో వైసీపీ నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



# గుర్రప్పాలెంలో దసరా ఉత్సవాల్లో బోనాలు సమర్పించిన మహిళలు

**జగ్గంపేట (మనసులో మాట) అక్టోబర్ 16:**

జగ్గంపేట మండలం గుర్రంపాలెం గ్రామంలో దసరా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గత 26 సంవత్సరాలుగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఇక్కడ దసరా మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు.దసరా 6వ రోజు అమ్మవారు సరస్వతి దేవిగా దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని మహిళలందరూ ఊరంతా ఊరేగుతూ అమ్మవారికి బోనాలు సమర్పించారు. మహిళలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలోపాల్గొని బోనాలు ఎత్తుకొని దేవి సెంటర్ నుండి శ్రీకృష్ణ ఆలయం మీదుగా దుర్గమ్మ అమ్మవారికి బోనాలు చూపించి తిరిగి శివాలయం లో శివపార్వతులను దర్శించుకుని వారి బోనాలను చూపించి తిరిగి దేవి సెంటర్లో అమ్మవారి వద్ద వారి కలశాలలో ఉన్నటువంటి పవిత్రమైనటువంటి గంగాజలంతో అమ్మవారి (ప్రతిమ బంగారు రంగు చాయ)విగ్రహానికి జలాభిషేకం చేస్తారు.ఈ దసరా ఉత్సవాల్లో భాగంగా ప్రతి సంవత్సరం 108 బోనాలుతో అత్యంత వైభవంగా ఊరేగింపుగా నిర్వహించడం జరుగుతుంది.ఈ కార్యక్రమంలో భాగంగా రింగ్ రోడ్ లో ఉన్నటువంటి ఈ ఆలయం వద్ద ప్రతి సంవత్సరం భారీ అన్న సమారాధన జరుగుతుంది. ఈ అన్న సమారాధనకు జగ్గంపేట, సగర పేట, గొల్లలగుంట, కాండ్రేగుల, అలాగే చుట్టూ ప్రక్కల ప్రాంతాలనుండి ఈ అన్న సమారాధనలో పాల్గొంటారు.దసరా మహోత్సవాల్లో భాగంగా నవరాత్రుల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు తో పాటు దసరా సందర్భంగా భవాని దీక్షిదరించిన భక్తులు ప్రతిరోజు అక్కడ ఉండేటువంటి భావానీలు వివిధ పూజ కార్యక్రమాల్లో పాల్గొంటారు.ఈ కార్యక్రమంలో దేవి సెంటర్ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకొని ఈ కార్యక్రమాన్ని గత 26 సంవత్సరాలుగా నిర్విరామంగా కమిటీ సభ్యులు, భక్తులు, ప్రజలు సహకారంతో అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు.







మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# అభివృద్ధి, సంక్షేమ పథకాలే కూటమి విజయానికి దోహదం

- కూటమి నిర్ణయానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలి
- యువతకు ప్రాధాన్యం.. నియోజకవర్గంలో రూ. 300 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం: టీడీపీ మండల అధ్యక్షుడు చవ్వాకుల నారాయణమూర్తి

**కాజులూరు, (మనసులో మాట) అక్టోబర్ 16**

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలే కూటమి విజయానికి దోహదపడతాయని తెలుగుదేశం పార్టీ కాజులూరు మండల అధ్యక్షుడు చవ్వాకుల నారాయణమూర్తి పేర్కొన్నారు. కూటమి పార్టీల నిర్ణయానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. శుక్రవారం కాజులూరు మండలం లోని కోలంక, పెదలంక, అంద్రంగి గ్రామాల్లో ఆయన పర్యటించి పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో సుమారు రూ.300 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించడం ప్రభుత్వ ప్రాధాన్యాలుగా ఉన్నాయని పేర్కొన్నారు.



**యువతకు ప్రాధాన్యం**

పార్టీలో యువతకు ప్రాధాన్యం కల్పిస్తూ, వారి సేవలను వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని నారాయణమూర్తి అన్నారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని సూచించారు. కూటమి పార్టీల మధ్య సమన్వయం ఎన్నికల్లో కీలకమని పేర్కొంటూ, పార్టీ నిర్ణయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని కోరారు.

**మంత్రి సుభాష్‌కు విజయాన్ని కానుకగా ఇవ్వాలి**

రానున్న ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అత్యధిక స్థానాల్లో గెలిపించి మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు విజయాన్ని కానుకగా అందించాలని నారాయణమూర్తి పిలుపునిచ్చారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కోలంక, పెదలంక, అంద్రంగి గ్రామాల్లో పర్యటన సందర్భంగా స్థానిక పార్టీ శ్రేణులతో ఎన్నికల సన్నద్ధత, గ్రామస్థాయి సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కోలంక గ్రామ కమిటీ అధ్యక్షుడు దాట్ల బుచ్చిబాబురాజు, కోటిపల్లి డిసి దాట్ల విజయ గోపాల్రాజు ,మాజీ సహకార సంఘం అధ్యక్షుడు దంతులూరి వెంకట నరసింహారాజు, యూనిట్ ఇంచార్జి దంతులూరు వంశీ ,గుబ్బల అర్జున్, చిరపూరి సత్తిబాబు రాజు ,నిమ్మకాయల రామమూర్తి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ నిట్ గ్రంథాలయంలో భక్తిశ్రద్ధలతో సరస్వతీ దేవి పూజ

**తాడేపల్లిగూడెం (మనసులో మాట), అక్టోబర్ 16 :**

తాడేపల్లిగూడెంలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్) డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో శుక్రవారం మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీ దేవి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రంథాలయ చైర్మన్, ఆచార్యులు డాక్టర్ కార్తికేయ శర్మ ఆధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకలకు డీన్ లు డాక్టర్ జి. రవి కిరణ్ శాస్త్రి, డాక్టర్ జీబీ వీరేష్ కుమార్ పాల్గొని అమ్మవారి చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కిరణ్ శాస్త్రి, డాక్టర్ వీరేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యారంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, అధ్యాపకులు, పరిశోధకులు తమ పరిశోధనల్లో నూతన ఆవిష్కరణలు సాధించాలని ఆకాంక్షించారు. సంస్థ సమగ్ర అభివృద్ధితో పాటు విద్యార్థుల విద్యా ప్రగతి, అధ్యాపకుల పరిశోధనా విజయాలకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని వేడుకున్నారు. విద్యార్థుల్లో జ్ఞాన సముపార్జనతో పాటు సృజనాత్మక ఆలోచనలు, పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించడంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్యార్థులు గ్రంథాలయంలోని విజ్ఞాన వనరులను సమర్థవంతంగా వినియోగించుకుని తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. పూజా కార్యక్రమాన్ని పురస్కరించుకుని గ్రంథాలయ ప్రాంగణాన్ని పుష్పాలు, రంగవల్లులతో అందంగా అలంకరించారు. ఈ వేడుకల్లో పలువురు ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు భారీగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తి, ఆధ్యాత్మికతతో పాటు విద్యా ప్రాధాన్యతను చాటిచెప్పిన ఈ కార్యక్రమం గ్రంథాలయ ప్రాంగణంలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నెలకొల్పింది. ఆచార్యులు డాక్టర్ జి.సంతోష్ కుమార్, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ రాజేశ్వర రెడ్డి, డాక్టర్ ప్రత్యూష జయంతి, డాక్టర్ హైమావతి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ధర్మతేజ, ఎఆర్ రవికాంత్, అసిస్టెంట్ లైబ్రేరియన్ కమల మహంతి, సూపరింటెండెంట్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





# మూలా నక్షత్రం వేళ.. సరస్వతీ దేవి అవతారంలో వాసవి అమ్మవారు

**మండపేట (మనసులో మాట) అక్టోబర్ 16**

సింహవాహనంపై అమ్మవారు, రజత పల్లకిలో సువర్ణమూర్తి మూలా నక్షత్రం, శుక్రవారం సందర్భంగా శ్రీ చక్ర సహిత వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు సరస్వతీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి గ్రామోత్సవ సేవలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక ఊరేగింపు భక్తులను ఆకట్టుకుంది.ఈ సందర్భంగా 108 మంది వాసవి అమ్మవారి భక్తులు కలశాలను ధరించి భక్తిశ్రద్ధలతో ఊరేగింపులో పాల్గొన్నారు. సింహవాహనంపై వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని, రజత పల్లకిలో సువర్ణమూర్తిని ఊరేగిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అమ్మవారి అలంకరణ, కలశాల ఊరేగింపు, పల్లకీ సేవ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆధ్యాత్మిక వాతావరణంలో సాగిన ఈ గ్రామోత్సవ కార్యక్రమం అమ్మవారి భక్తుల్లో భక్తిభావాన్ని నింపింది. ఆర్యవైశ్య సంఘం, వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# వేగుళ్ల వారసుడు.. మున్సిపల్ చైర్మన్ అవుతాడా?

- తెరపైకి మరో పేరు మండపేట రాజకీయాల్లో ఇదే హాట్ టాపిక్
- అజయ్ బాబు పేరుపై ఆసక్తి

**మండపేట (మనసులో మాట) అక్టోబర్ 16**



మండపేట రాజకీయాల్లో ప్రస్తుతం ఆసక్తికర చర్చ నడుస్తోంది. మండపేట ఎమ్మెల్యేగా ఉన్న వేగుళ్ల జోగేశ్వరరావు తమ్ముడు కొడుకు వేగుళ్ల అజయ్ బాబు మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని అధిరోహిస్తారా? అన్న ప్రశ్న పట్టణ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. రానున్న మున్సిపల్ రాజకీయ పరిణామాలు, కూటమి అభ్యర్థి ఎంపిక నేపథ్యంలో వేగుళ్ల కుటుంబం ప్రభావంపై చర్చలు జోరందుకున్నాయి.

**అజేయ్ బాబు పేరు తెరపైకి...**

మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తమ్ముడు వేగుళ్ళ రాంబాబు తనయుడు అజేయ్ బాబు పేరు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిత్వానికి సంబంధించి స్థానికంగా చర్చకు వస్తుండటంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. అందరితో ఆప్యాయంగా మెలిగే వ్యక్తిగా గుర్తింపు పొందిన అజేయ్ బాబు రాజకీయంగా ఎలాంటి పాత్ర పోషించబోతున్నారన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అజయ్ బాబు అభ్యర్థిత్వంపై జరుగుతున్న చర్చల్లో మరో ఆసక్తికర అంశం తెరపైకి వస్తోంది. మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని ఆశిస్తే జనసేన కందువా కప్పుకోవాల్సిందేనా? అన్న ప్రశ్న రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నట్లు చర్చ సాగుతోంది. కూటమిలోని పార్టీల మధ్య పదవుల పంపకం, అభ్యర్థి ఎంపికలో అనుసరించే రాజకీయ వ్యూహాలు ఈ అంశానికి ప్రాధాన్యతను పెంచుతున్నాయి.

**అధిష్ఠానం నిర్ణయమే కీలకమా?....**

మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి ఎంపికలో కూటమి అధిష్ఠానం నిర్ణయం కీలకం కానుంది. పార్టీ పెద్దల ఆలోచనలు, స్థానిక రాజకీయ సమీకరణాలు, ఆశావహుల ప్రయత్నాలు అభ్యర్థి ఎంపికపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వేగుళ్ల కుటుంబం నుంచి అజేయ్ బాబుకు అవకాశం లభిస్తుందా? లేక అధిష్ఠానం మరో పేరును తెరపైకి తీసుకువస్తుందా? అన్న ఉత్కంఠ నెలకొంది. మున్సిపల్ చైర్మన్ పీఠం ఎవరిని వరిస్తుందన్న అంశంపై పట్టణంలో రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యేగా ఉన్న వేగుళ్ళ జోగేశ్వరరావు తమ్ముడు కొడుకు మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపడితే అది మండపేట రాజకీయాల్లో కీలక పరిణామంగా నిలవనుంది. అయితే జనసేన కందువా అంశం, అజేయ్ బాబు అభ్యర్థిత్వం, కూటమి పెద్దల నిర్ణయం వంటి అంశాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

**వేగుళ్ల వారసుడు మున్సిపల్ చైర్మన్ అవుతాడా?...**

అనే రాజకీయ సమీకరణం నిజమవుతుందా? వేగుళ్ల కుటుంబానికి మరో కీలక పదవి దక్కుతుందా? అన్న ప్రశ్నలకు రానున్న ప్రశ్నకు నేడు సమాధానం లభించనుంది. అప్పటివరకు మండపేట మున్సిపల్ చైర్మన్ ఎంపిక పట్టణ రాజకీయాల్లో ఉత్కంఠను కొనసాగించనుంది.